మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 2-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 303 Issue: 303

01 మే 2026 - శుక్రవారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - వసంత ఋతువు, వైశాఖ మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - తె. 5:54, సూర్యాస్తమయం - సా. 6:32, తిథి, పౌర్ణమి రా. 10:54 వరకు, తరువాత పాడ్యమి, సంస్కృత వారం, భృగు వాసరః, నక్షత్రం, స్వాతి తె. 4:30o వరకు, తరువాత విశాఖ, యోగం, సిద్ధి రా. 9:09 వరకు, కరణం, విష్టి ఉ. 10:01 వరకు, బవ రా. 10:54 వరకు, వర్జ్యం, ఉ. 8:24 నుండి ఉ. 10:09 వరకు, దుర్ముహూర్తం, ఉ. 8:25 నుండి ఉ. 9:16 వరకు, మ. 12:38 నుండి మ. 1:29 వరకు, రాహుకాలం, ఉ. 10:38 నుండి మ. 12:13 వరకు, యమగండం, మ. 3:23 నుండి సా. 4:57 వరకు, గుళికాకాలం, ఉ. 7:28 నుండి ఉ. 9:03 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:18 నుండి తె. 5:06 వరకు, అమృత ఘడియలు, సా. 6:55 నుండి రా. 8:41 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:48 నుండి మ. 12:38 వరకు, గమనిక: “o” అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana




## మృత్యు వలయం

### ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం

### ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు.. ఏడుగురు దుర్మరణం

**హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. శంషాబాద్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్ 16 వద్ద ఆగివున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు (టీఎస్ 23 ఎఫ్ 2298) ఢీకొట్టడంతో ఈ యాక్సిడెంట్ చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.**

శంషాబాద్, మే 1 (ఈవార్తలు): ఈ మృతుల్లో ఇద్దరు చిన్నారులు, మహిళలు ఉన్నారు. వీరంతా సిరిసిల్ల వాసులు కావడం గమనార్హం. వేగంగా దూసుకువచ్చిన కారు.. ఆగి ఉన్న లారీ కిందికి చొచ్చుకుపోవడంతో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాద తీవ్రతకు కారులో ఉన్న మృతదేహాలు అందులోనే చిక్కుకుపోయాయి. వారిని బయటికి తీసేందుకు స్థానికులు, పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోవడంతో దాని కింద మృతదేహాలు చిక్కుకుపోయాయి. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఏడుగురు వ్యక్తులు ఉన్నారు. వారిలో ఆరుగురు అక్కడే చనిపోగా.. మిగిలిన ఒక్క వ్యకి చికిత్స పొందుతూ మరణించాడు.అతివేగమే ఈ ఘోర ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కాగా, ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు సిరిసిల్ల బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కుటుంబ సభ్యులు అని తెలిసింది. మృతులకు కేటీఆర్ సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే - తరువాయి 2 వ పేజీలో...

## గుది బండ



### కమర్షియల్ సిలిండర్‌పై రూ.993 పెంపు

**ఎన్నికలు అయిపోగానే షాకిచ్చిన కేంద్రం**

**అమెరికా-ఇరాన్ యుద్ధం మరోసారి భారతీయ గ్యాస్ వినియోగదారులపై భారీ ఆర్థిక భారం పడేసింది. హోటల్స్, రెస్టారెంట్లు, హాస్టల్స్ వంటి వాటిలో వినియోగించే కమర్షియల్(వాణిజ్య) గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. ఒక్క సిలిండర్ (19 కేజీలు)పై సగటున రూ.993 పెంచుతున్నట్లు చమురు సంస్థలు ప్రకటించాయి.**

న్యూఢిల్లీ: పెంచిన ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పేర్కొన్నాయి. అయితే గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదని కేంద్రం వెల్లడించింది. ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి మార్గంలో నెలకున్న ఆటంకాల కారణంగా ధరల పెరుగుదల అనివార్యమైనట్లుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్ ధరల్లో మాత్రం కేంద్రం ఎలాంటి పెంపు చేయలేదు. దేశీయ విమాన సంస్థలకు కూడా కేంద్రం ఊరట కల్పించింది. అయితే ఐదు కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. వాణిజ్య అవసరాలకు వినియోగించే సిలిండర్ ధర పెరుగడం రెస్టారంట్లు, హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీల వ్యాపారాన్ని దెబ్బతీస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా హెటల్స్, రెస్టారెంట్ల నిర్వాహకులు ఆ భారాన్ని వినియోగదారులపై మోపడం ఖాయంగా - తరువాయి 2 వ పేజీలో...

## పెట్రో ధరలూ పెరిగే చాన్స్

**ధరల పెంపు కొట్టిపారేయలేం**

**కేంద్ర ప్రభుత్వ వర్గాలు కీలక వ్యాఖ్యలు**




న్యూఢిల్లీ: బెంగాల్, తమిళనాడు, కేరళ సహా ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు ముగిసిన వెంటనే ఇంధన ధరలు పెరుగుతాయని జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ప్రతిపక్షాలు సైతం ఇదే ఆరోపణలు చేస్తున్న తరుణంలో కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను కేంద్రం భారీగా పెంచింది. ఒక్క రోజే రూ.993 పెంచడంతో చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఇదిలా ఉండగా సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతాయనే వాదనలను కొట్టిపారేయలేమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరాన్, - తరువాయి 2 వ పేజీలో...

## బంకులో పెద్ద బొక్క!

**27 లీటర్ల ట్యాంక్‌లో 32 లీటర్ల పెట్రోల్**

**5 లీటర్ల పెట్రోల్ ఎక్కడికి పోయినట్లు?**

**హైదరాబాద్‌లో వెలుగులోకి భారీ మోసం**

**హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన కొత్త తరహా మోసం వాహనదారుల్లో సరికొత్త భయాలను రేకెత్తిస్తోంది. కారు ట్యాంక్ కెపాసిటీ కంటే ఎక్కువ పెట్రోల్ అందులో ఎలా పడుతుంది అంటూ కారు యజమాని ప్రశ్నించడంతో ఈ భారీ స్కాం వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు పెట్రోల్ బంక్‌లలో పెట్రోల్, డీజిల్‌లలో కల్తీ, నీళ్లు రావడం వంటి మోసాలు చూశాం. మరికొన్ని పెట్రోల్ పంపుల్లో రీడింగ్ ఎక్కువ, తక్కువ చూపించి పెట్రోల్, డీజిల్ కొడుతున్నారనే వార్తలు కూడా వచ్చాయి.**





హైదరాబాద్, మే 1 (ఈవార్తలు):తాజాగా హైదరాబాద్‌లోని హయత్‌నగర్ ప్రాంతంలో ఒక విచిత్రమైన, అదే సమయంలో వినియోగదారులను తీవ్ర ఆందోళనకు గురిచేసే ఘటన వెలుగులోకి వచ్చింది. సాధారణంగా మనం పెట్రోల్ బంకులకు వెళ్లినప్పుడు మన వాహనంలో పట్టే ఇంధన సామర్థ్యం మేరకే బిల్లు వేస్తారని నమ్ముతాం. కానీ, ఒక కస్టమర్ తన కారు ట్యాంక్ కెపాసిటీ కేవలం 27 లీటర్లు మాత్రమే ఉండగా, ఏకంగా 32 లీటర్లు నింపినట్లు రశీదు ఇవ్వడంతో కంగుతిన్నాడు. హయత్‌నగర్‌లోని ఓ హెచ్‌పీ పెట్రోల్ బంకులో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. తన కారులోని 27 లీటర్ల కెపాసిటీ ఉన్న ట్యాంక్ ఫుల్ చేయాలని సిబ్బందికి చెప్పగా.. అందులో 29.5 లీటర్ల పెట్రోల్ కొట్టినట్లు తెలిపారు. అయితే అప్పటికే ఆ కారులో 2, 3 లీటర్ల పెట్రోల్ ఉందని.. దీంతో 27 లీటర్ల పెట్రోల్ ట్యాంక్‌లో 32 లీటర్ల పెట్రోల్ - తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,038 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,827 |

## పోలీసులకు అంత ధైర్యమా?

### కోర్టు ఆదేశాలనే ధిక్కరిస్తారా?

**చలాన్ల పేరుతో వాహనాల సీజ్**

**తీవ్రంగా పరిగణించిన హైకోర్టు**

**డీజీపీ, హోం సెక్రటరీకి నోటీసులు**




**రాష్ట్రంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడ్డారనే ఆరోపణలతో చలాన్లు పెండింగ్ ఉన్నాయనే కారణంతో వాహనాలను స్వాధీనం చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పెండింగ్ చలాన్లు ఉంటే వాహనాలను సీజ్ చేయొద్దని ఇప్పటికే తెలంగాణ హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ.. వాటిని లెక్క చేయకుండా పోలీసులు ఇప్పటికీ వాహనాలను సీజ్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో హైకోర్టు వాదనలు కొనసాగుతున్నాయి.**

హైదరాబాద్, మే 1 (ఈవార్తలు): ఈ నేపథ్యంలోనే హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ.. వాహనాలను సీజ్ చేస్తూ.. ఈ వ్యవహారంపై ఒక బాధితుడు తెలంగాణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కోర్టు ధిక్కార పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే రాష్ట్ర హోం సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వైఫల్యంపై హైకోర్టు వివరణ కోరింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసుకు సంబంధించిన.. తదుపరి విచారణను వచ్చే నెల 19వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.



## ఆర్టీసీకి ఆశల సౌధం

### పీఆర్సీ అంశాన్ని పరిష్కరిస్తాం

**గాజులరామారంలో 100, బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో బస్ టెర్మినళ్లు**

**ఒక డ్రైవర్‌నూ ఉద్యోగం నుంచి తొలగించం**

**ఉద్యోగులు, మేనేజ్‌మెంట్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి**


**ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి**

**సమ్మె కాలంలో వేతనాల చెల్లింపు, కేసుల ఎత్తివేతకు ఆదేశం**

› 2

ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### విశ్వవాణి



చేపలకు కాళ్లు ఉండటం ఎప్పుడైనా చూశారా? లేదు కదూ. తాజాగా, శాస్త్రవేత్తలు సముద్రంలో మూడు కాళ్లు కలిగిన చేపను గుర్తించారు. దాదాపు మీటరు ఎత్తు వరకు పెరిగే కాళ్లను కలిగిన ఈ చేప.. భారీ వరద వచ్చే సమయాల్లోనూ నిటారుగా ఉండగలదట. ట్రైపాడ్‌లా మూడు కాళ్లు ఉండటంతో దానికి ట్రైపాడ్ ఫిష్ అని నామకరణం చేశారు.



## 870 నౌకలు బ్లాక్

### హర్మూజ్ వద్ద నిలిచిపోయిన షిప్పులు.. 90% పైగా పడిపోయిన రవాణా

టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధి గుండా నౌకాయానం గణనీయంగా క్షీణించింది. ఈ సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి హర్మూజ్ జలసంధిలో రవాణా 90 శాతానికి పైగా పడిపోయింది. మార్చి 1 నుంచి ఏప్రిల్ 27 మధ్య హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులు, వేధింపులు, ప్రమాదాల నుంచి త్రుటిలో తప్పిపోవడం వంటి 40కి పైగా సంఘటనలు జరిగాయి. ఈ మేరకు రాయల్ నేవీ నేతృత్వంలోని పర్యవేక్షణ సంస్థ అయిన యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకేఎమ్‌టీఓ) ఓ ప్రకటనలో తెలిపింది. 'పశ్చిమాసియా ఘర్షణల వల్ల హర్మూజ్ జలసంధి తీవ్రంగా ప్రభావితం అయ్యింది. ఆ జలసంధి - తరువాయి 2 వ పేజీలో...

## మే 14 నాటికి నైరుతి

**సాధారణం కంటే ముందే అండమాన్‌కు**

**మే లో కొన్ని చోట్ల అధిక ఉష్ణోగ్రతలు**

**పలు ప్రాంతాల్లో వడగాల్పుల తీవ్రత**

**రాత్రి సమయాల్లోనూ వేడి ఉండే చాన్స్**

**భారత వాతావరణ శాఖ వెల్లడి**



**నైరుతి రుతుపవనాలపై కూడా భారత వాతావరణ వాఖ (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చే అవకాశం ఉందని, మే 14 నుంచి 16వ తేదీ మధ్యలో రుతుపవనాలు అండమాన్, నికోబార్ దీవులను తాకే అవకాశం ఉందని చెప్పింది. ఇది సాధారణ సమయం కంటే కొంచెం ముందే కావడం గమనార్హం.**

న్యూఢిల్లీ: మే నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ భారతంలో మంచి వర్షాలు కురిసినప్పటికీ, ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని చెప్పింది. అటు.. - తరువాయి 2 వ పేజీలో...

## ఫోన్లలో సైరన్

**లక్షల ఫోన్లకు నేడు ఎమర్జెన్సీ అలర్ట్**

**కంగారు పడొద్దని కేంద్రం సూచన**

**దేశవ్యాప్తంగా శనివారం లక్షల మంది మొబైల్ ఫోన్లలో ఒక్కసారిగా పెద్ద సైరన్ శబ్దం వినిపించనుంది. అయితే ప్రజలు దీని గురించి భయపడడం లేదా కంగారు పడొద్దని కేంద్రం సూచించింది.**

› 2



## రాశి ఫలాలు

2-5-2026

**మేషం:** స్థిరాస్తి విషయమై సోదరులతో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. కొన్ని పనులలో బంధు మిత్రుల సలహాలు కలసివస్తాయి. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

**వృషభం:** ఆకస్మిక ధనవ్యయ సూచనలున్నవి. కుటుంబసభ్యులతో విభేదాలు కలుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనుల్లో చికాకులు తప్పవు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సూచనలున్నవి. ఉద్యోగాలలో ఊహించని స్థాన చలన సూచనలు ఉన్నవి.

**మిథునం:** వృత్తి ఉద్యోగాలలో అధికారులతో చర్చలు ఫలించవు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ముఖ్యమైన వ్యవహారాల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందటంలో జాప్యం కలుగుతుంది.

**కర్కాటకం:** వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. ఒక వ్యవహారంలో బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులు శ్రమాధిక్యతతో కానీ పనులు పూర్తి కావు. ఆర్థికంగా గందరగోళ పరిస్థితులు ఉంటాయి. వ్యాపార ఉద్యోగాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి.

**సింహం:** చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. బంధు మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. అవసరానికి ధన సహాయం అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపార ఉద్యోగాలలో ఒత్తిడి మరింత అధికమవుతుంది.

**కన్య:** చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సోదరులతో వివాదాలు రాజీ చేసుకుంటారు. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఊహించని అభివృద్ధి సాధిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

**తుల:** నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనులలో వ్యయ ప్రయాసలు తప్పవు. ఆర్థిక పరిస్థితి మరింత గందరగోళంగా ఉంటుంది. ఉద్యోగ విషయంలో ఎంత కష్టపడినా తగిన గుర్తింపు లభించదు.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో సొంత ఆలోచనలు అమలు చేయడం మంచిది. స్థిరాస్తి క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఉద్యోగాలలో అదనపు పని భారం ఉన్నప్పటికీ నిదానంగా పూర్తిచేస్తారు.

**ధనస్సు:** చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారమున భాగస్తులతో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగయోగం ఉన్నది. గృహమున ముఖ్య నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది.

**మకరం:** ఆకస్మిక ప్రయాణాలు చెయ్యవలసివస్తుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు. వృత్తి వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. కొన్ని వ్యవహారాలలో మిత్రులతో విభేదాలు కలుగుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**కుంభం:** ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. సోదరులతో మాటపట్టింపులు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల నుంచి ఒత్తిడి తప్పదు.

**మీనం:** స్థిరాస్తి కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. భూ సంబంధిత క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో నూతనోత్సాహంతో పనిచేసే అధికారులు మన్ననలు పొందుతారు.

# మే 14 నాటికి నైరుతి

(మొదటి పేజీ తరువాయి)

మే నెలలో నమోదయ్యే ఉష్ణగ్రతలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక విషయాలను వెల్లడించింది. ఈ నెలలో ఎండలు, వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర హెచ్చరించారు. సాధారణంగానే మే నెలలో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. అయితే, ఈ ఏడాది కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లో వడగాల్పుల తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని మృత్యుంజయ్ తెలిపారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని దిగువ ప్రాంతాల్లో ఎండల తీవ్రత పెరుగుతుంది ఐఎండీ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బంగాల్ వంటి రాష్ట్రాల్లో సముద్రపు తేమతో కూడిన వేడి గాలి ఎక్కువగా ఉక్కపోత ఉండొచ్చని చెప్పింది. గుజరాత్, మహారాష్ట్రలోని విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటే అవకాశం ఉందని వివరించింది. ఈసారి మే నెలలో పగటి పూట మాత్రమే కాదు, రాత్రి సమయాల్లో కూడా వేడి ఎక్కువగా ఉంటుందని ఐఎండీ వెల్లడించింది. దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు (రాత్రి వేళలు) సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని చెప్పింది. దీనివల్ల రాత్రిపూట కూడా ఉక్కపోత అధికంగా ఉంటుందని వెల్లడించింది. పంజాబ్, రాజస్థాన్‌లోని కొంత భాగం, మధ్య భారతం, దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగా లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది. పసిఫిక్ మహాసముద్రంలో 'ఎల్ నినో' పరిస్థితులు బలపడుతున్నాయని ఐఎండీ పేర్కొంది. రుతుపవనాల సీజన్ (జూన్–సెప్టెంబర్) మధ్యలో ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉందిని వెల్లడించింది. ఎల్ నినో వల్ల భారతదేశంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉంటుంది. మధ్య పసిఫిక్ మహాసముద్ర జలాలు వేడెక్కే పరిస్థితిని ఎల్‌నినోగా పరిగణిస్తారు. ఈ ప్రభావం రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఐఎండీకి చెందిన 'మాన్‌సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్' అంచనాల ప్రకారం, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్‌నినో పరిస్థితులు అభివృద్ధి చెందే అవకాశముందని వెల్లడించింది. ఏప్రిల్ వాతావరణ పరిస్థితులపై కూడా ఐఎండీ సమీక్ష విడుదల చేసింది. దేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయని తెలిపింది. అయితే దక్షిణ భారతదేశంలో మాత్రం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయని వెల్లడించింది. ఏప్రిల్ నెలలో దేశాన్ని ఏడు పాశ్చాత్య అలజడులు ప్రభావితం



చేశాయని ఐఎండీ పేర్కొంది. వీటి ప్రభావంతో పలు రాష్ట్రాల్లో వర్షాలు, ఉరుములు, ఈదురుగాలులు నమోదయ్యాయని తెలిపింది. మే నెలలో కూడా వాతావరణంలో మార్పులు కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. ఈ మేరకు కొన్ని ఐఎండీ కొన్ని సూచనలు చేసింది. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బయట తిరగకపోవడం ఉత్తమమని పేర్కొంది.

# ఫోన్లలో సైరన్

**లక్షల ఫోన్లకు నేడు ఎమర్జెన్సీ అలర్ట్**

**కంగారు పడొద్దని కేంద్రం సూచన**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా శనివారం లక్షల మంది మొబైల్ ఫోన్లలో ఒక్కసారిగా పెద్ద సైరన్ శబ్దం వినిపించనుంది. అయితే ప్రజలు దీని గురించి భయపడడం లేదా కంగారు పడొద్దని కేంద్రం సూచించింది. భవిష్యత్తులో ఏదైనా ప్రకృతి విపత్తులు అంటే వరదలు, తుఫానులు, భూకంపాలు వంటివి వచ్చినప్పుడు, ప్రజలందరినీ ఒకేసారి అప్రమత్తం చేయడానికి ప్రభుత్వం 'సాచెట్' అనే కొత్త సిస్టం తయారు చేసింది. ఇది సరిగ్గా పనిచేస్తుందో లేదో తెలుసుకోవడానికి టెలికమ్యూనికేషన్ శాఖ, విపత్తు నిర్వహణ సంస్థ కలిసి ఈ పరీక్షను నిర్వహిస్తున్నాయి.

**ఏం జరుగుతుంది?**

మీ మొబైల్‌కు ఒక మెసేజ్ వస్తుంది. దాంతో పాటు పెద్ద సైరన్ శబ్దం వినిపిస్తుంది. ఇది కేవలం ఒక 'టెస్ట్' మాత్రమే. కాబట్టి ఈ మెసేజ్ లేదా శబ్దం చూసి మీరు ఏమీ చేయక్కర్లేదు. ఈ అత్యవసర హెచ్చరిక వ్యవస్థ (క్యాప్) ఆధారంగా పనిచేస్తుంది. అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ సిఫార్సు చేసిన ఈ టెక్నాలజీ ప్రస్తుతం దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమల్లో ఉంది. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. శనివారం (మే 2) మీ ఫోన్‌లో సైరన్ మోగినా లేదా ఎమర్జెన్సీ అలర్ట్ అని మెసేజ్ వచ్చినా అది ప్రభుత్వం చేస్తున్న చిన్న టెస్టింగ్ అని గమనించాలి. భయపడకుండా ఇతరులకు కూడా ఈ విషయం తెలియజేయండి. మీ ఫోన్ సైలెంట్ మోడ్‌లో ఉన్నా సైరన్ వినిపిస్తుంది.

**లాభాలు ఇవీ..**

**ఏదైనా ప్రమాదం పొంచి ఉన్నప్పుడు సెకన్ల వ్యవధిలో వేలమందికి సమాచారం చేరుతుంది.**

**వరదలు లేదా తుఫానులు వచ్చే ముందు హెచ్చరికలు పంపడం ద్వారా ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చు.**

**ప్రమాదం ఉన్న ప్రాంతంలో ఉన్న ఫోన్లకు మాత్రమే ఈ మెసేజ్‌లు వెళ్లేలా ఈ టెక్నాలజీని రూపొందించారు.**

# పెట్రో ధరలూ పెరిగే చాన్స్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగినప్పటికీ, నాలుగేళ్ల నుంచి రిటైల్ ధరలు సవరించకపోవడంతో నష్టాలు వస్తున్నాయని, ఈ క్రమంలోనే భవిష్యత్తులో డీజిల్, పెట్రోల్ ధరలు పెంపు అవకాశాన్ని తోసిపుచ్చలేమని వ్యాఖ్యానించాయి. ఎల్పీజీ ధరలు పెరుగుదల విషయంలో కేంద్రంలోని మోదీ సర్కారుపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయని తాను ముందే చెప్పానని, ఇప్పుడు ఎల్పీజీ ధరలు పెంపు అందుకు నిదర్శనమని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, వాణిజ్య సిలిండర్ ధరల పెంపును కేంద్రం సమర్థించుకుంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర పెట్రోలియం సహజవాయువు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి వ్యాఖ్యానించారు.

# గుది 'బండ'

(మొదటి పేజీ తరువాయి)

కనిపిస్తుంది. అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం ఫిబ్రవరిలో ప్రారంభంకాగా.. అప్పటి నుంచి వాణిజ్య సిలిండర్ ధరను మూడుసార్లు పెంచారు. మార్చిలో రూ.144, ఏప్రిల్ ఒకటిన రూ.195, ఇప్పుడు ఒక్కసారిగా ఏకంగా రూ.993 పెంచేయడం వినియోగదారులకు షాక్ ఇస్తుంది. దీంతో ఒక్కో కమర్షియల్ సిలిండర్ ధర రూ.3వేలు దాటినట్లయ్యింది. హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ ధర రూ.3,315కు చేరింది. ఢిల్లీలో రూ.3,071గా ఉంది. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడం సామాన్యులకు ఊరటనిచ్చింది. ఇక, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల్లో ఇంటర్నేషనల్ విమానాల ఫ్యూయెల్ రేటు 5 శాతం పెంచారు.

# ఆర్టీసీకి ఆశల సౌధం



హైదరాబాద్, మే 1 (ఈవార్తలు): ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు నివాసంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని సూచించారు. ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి.. భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సీఎం అన్నారు. ఆర్టీసీ బకాయిలు తమ హయాంలోని కావని.. కానీ వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల నిధులను వాడుకుందని సీఎం గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అంతా కలిసిరావాలని, భావోద్వేగాలు, రాజకీయాల ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం వాటిల్లుతుందని సీఎం అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యునిగా గెలిచిన్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సీఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామని, కారుణ్య నియామకాలు చేప్టటామని రేవంత్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని.. నెలా నెలా చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందని సీఎం అన్నారు. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో వంద ఎకరాలు కేటాయించామని, బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో)లో 150 ఎకరాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ టెర్మినళ్ల నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఆర్టీసీలో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు వ్యయం చేస్తున్నారని.. ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవీల వైపు మొగ్గుచూపుతున్నామని ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించుకోవాలని, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని సీఎం అన్నారు. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీకి కృషి చేస్తామని సీఎం తెలిపారు. అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకోవడానికి కార్మికులు సహకరించాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను తొలగించమని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, మేనేజ్‌మెంట్ మధ్య గ్యాప్ రాకుండా చూసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. డిపో మేనేజర్లు, ఈడీ, ఎండీ స్థాయి అధికారులు తరచూ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై సుహృద్భావ వాతావరణంలో మాట్లాడుకుంటే సగం సమస్యలు పరిష్కారమవుతాయని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో మూడు నెలలకోసారి సమావేశం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డికి రేవంత్ రెడ్డి సూచించారు. అనేక ఇబ్బందులున్నా ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి తాము పెద్దపీట వేస్తున్నామని సీఎం తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని.. కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని రేవంత్ రెడ్డి తెలిపారు. చిన్న చిన్న స్పర్ధలతో సంస్థకు నష్టం వాటిల్లే పనులు చేయకూడదని.. సంస్థ మనుగడ సాగిస్తేనే అందరికీ మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని రేవంత్ రెడ్డి కార్మిక సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యే లు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఏ.ఆర్.రెడ్డి, థామస్ రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్) , అశ్వత్థామ రెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (ఠి)), వీరాంజనేయులు, వి.ఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, ఈ.వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), పి.కమల్ రెడ్డి, ఎండీ మౌలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకే బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఠి)), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కె.సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్టీసీ వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఈ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ (బహుజన్ వర్కర్స్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు.

# బంకులో పెద్ద బొక్క!

(మొదటి పేజీ తరువాయి)

ఎలా నింపారని బంక్ సిబ్బందిని ఆ కారు ఓనర్ నిలదీశాడు. తన కారులో నింపిన పెట్రోల్‌ను బయటికి తీసి కొలవాలని డిమాండ్ చేశాడు. అయితే పెట్రోల్ బంకు సిబ్బంది 5 లీటర్ల క్యాన్లతో పెట్రోల్‌ను కొలుస్తామని చెప్పారని, అలా కాకుండా మీజరింగ్ సిలిండర్‌తోనే కొలవాలని వాదించాడు. తన కారు ట్యాంక్ సామర్థ్యాన్ని మించి 5 లీటర్ల అదనపు పెట్రోల్ ఎలా పోశారని బాధితుడు బంకు సిబ్బందిని గట్టిగా నిలదీశాడు. దీనికి బంకు సిబ్బంది నుంచి సరైన స్పందన రాలేదు. పైగా, చాలా నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇవ్వడంతో కస్టమర్‌కు అనుమానం మరింత బలపడింది. సాధారణ ప్రజలను ఎలా మోసం చేస్తున్నారనే విషయంపై అక్కడ కొంతసేపు వాగ్వాదం కూడా చోటుచేసుకుంది. తమ పెట్రోల్ బంకులో ఎలాంటి సమస్య లేదని, సమస్య అంతా కారులోనే ఉందని నిర్లక్ష్యంగా జవాబిచ్చారు. మెకానిక్ వద్దకు వెళ్లి కారును చూపించుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు. గట్టిగా నిలదీస్తే పెట్రోల్ బంకు సిబ్బంది.. పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టుకోవాలని చెబుతున్నారని కారు ఓనర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది వైఖరితో విసిగిపోయిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించారు. బంకు నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మృత్యు 'వలయం'

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ తన కార్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘటనా స్థలానికి వెళ్లి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని తన పీఏ మహేందర్ రెడ్డిని ఆదేశించారు. శంషాబాద్ ఏసీపీ నాగభూషణంతో స్వయంగా మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను, ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడంలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని కోరారు. నియోజకవర్గ ప్రజల ప్రాణాలు రోడ్డు ప్రమాదాల్లో కోల్పోవడం తనను ఎంతగానో కలచివేసిందని, మృతుల కుటుంబాలకు పార్టీ పరంగా, వ్యక్తిగతంగా పూర్తి స్థాయిలో తోడుంటామని స్పష్టం చేశారు.

# 870 నౌకలు బ్లాక్

(మొదటి పేజీ తరువాయి)

గుండా ప్రయాణించే నౌకలు, అందులోని సిబ్బంది నేరుగా దెబ్బతిన్నారు. అదే సమయంలో అనేక నౌకలపై దాడులు జరిగాయి. వాటిని హర్మూజ్ నుంచి బలవంతం వెనక్కి వెళ్లేలా దాడులు చేశారు. వాణిజ్య నౌకలపై ప్రత్యక్ష దాడులకు సంబంధించిన కనీసం 26 సంఘటనలు జరిగాయి' అని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ప్రకటనలో పేర్కొంది. పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా 850– 870 పెద్ద వాణిజ్య నౌకలు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ హెడ్ కమాండర్ జో బ్లాక్ తెలిపారు. ఈ ఇరుకైన జల మార్గంలో భద్రతాపరమైన ప్రమాదాల వల్ల అవి సురక్షితంగా బయటకు వెళ్లలేకపోతున్నాయని పేర్కొన్నారు. తమ మొదటి ప్రాధాన్యం సముద్రయాన సిబ్బంది భద్రత, రక్షణేనని వెల్లడించారు. సుమారు 20,000 మంది నావికులు ఎక్కడికీ వెళ్లలేని నౌకల్లో చిక్కుకుపోయారని స్పష్టం చేశారు. నౌకల్లోని సిబ్బంది తరచుగా మారడం లేదన్నారు. దీంతో వారిపై ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే సముద్రయాన సిబ్బంది మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. 9/11 దాడుల అనంతరం యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ప్రారంభమైంది. రాయల్ నేవీ మద్దతుతో ఇది పనిచేస్తోంది. ఎర్ర సముద్రం, గల్ఫ్ ప్రాంతం, ఉత్తర హిందూ మహాసముద్రంలో రవాణా చేసే నౌకలకు కీలకమైన సముద్ర భద్రతా సమాచార కేంద్రంగా సేవలు అందిస్తోంది. ఏఐఎస్ ట్రాకింగ్ వ్యవస్థలు, ఓడల స్వచ్ఛంద నివేదికలు, ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్‌పై ఆధారపడే ఈ సంస్థ, గతంలో సోమాలియా సముద్రపు దొంగల ఘటనలు, ఎర్ర సముద్రంలో ఇటీవలి ముప్పుల సమయంలో కీలక పాత్ర పోషించింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు జరిపాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించారు. దీంతో అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. దీనికి ప్రతిగా టెహ్రాన్ పశ్చిమాసియాలోని ఇజ్రాయెల్, అమెరికా ఆస్తులపై ప్రతీకార దాడులు చేసింది. ఈ ఉద్రిక్తతలకు ముందు హర్మూజ్ జలసంధి గుండా ప్రతిరోజూ సుమారు 130 నౌకలు ప్రయాణించేవి. అయితే ఇప్పుడు ఆ సంఖ్య రోజుకు 10 కంటే తక్కువకు పడిపోయింది. దీంతో ప్రపంచంలోని అత్యంత కీలకమైన సముద్ర మార్గాలలో ఒకటైన హర్మూజ్ జలసంధి దాదాపుగా స్తంభించిపోయింది. హర్మూజ్ జలసంధి ఒక కీలకమైన ప్రపంచ ఇంధన రవాణా మార్గం. వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఈ మార్గంలో ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరా గొలుసులపై తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి. యూఎస్–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అమల్లోకి ఉన్నప్పటికీ ఇరు దేశాల పరస్పరం హెచ్చరికలు చేసుకుంటున్నాయి. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా నుంచి ఇజ్రాయెల్‌కు భారీగా సైనిక సామగ్రి చేరుకుంది. దీంతో ఇరాన్‌పై మరోసారి భీకర దాడులకు అమెరికా సిద్ధమవుతోందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, ఇటీవలే ఒక్క రోజు వ్యవధిలోనే అమెరికా నుంచి 6,500 టన్నుల సైనిక సామగ్రి అందినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది.

# డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు



హైదరాబాద్, మే 1 (ఈవార్తలు): రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సీవీ ఆనంద్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయనకు క్షేత్రస్థాయి నుండి అత్యున్నత స్థాయి వరకు విశేషమైన అనుభవం ఉంది. వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో పనిచేసిన సమయంలో మావోయిస్టు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని శాంతిభద్రతలను కాపాడారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేస్తూ నగర భద్రతలో తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించారు. సీవీ ఆనంద్ అంటేనే టెక్నాలజీకి మారుపేరు. ఈ-చలాన్, స్పీడ్ గన్స్ వంటి వ్యవస్థలను ప్రవేశపెట్టి ట్రాఫిక్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. రివర్సిబుల్ లేన్లు, ఫ్రీ లెఫ్ట్ వంటి విధానాల ద్వారా వాహనదారుల ఇబ్బందులను తగ్గించడంలో ఆయన విజయం సాధించారు. ఇప్పుడు పూర్తిస్థాయి డీజీపీగా రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్ నియంత్రణ మరియు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆయన ఎలాంటి వినూత్న వ్యూహాలను రూపొందిస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**తెలంగాణ పోలీసింగ్‌ను నంబర్ వన్ చేస్తా**

రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు విచారణ చివరి దశకు చేరుకుందని, త్వరలోనే సిట్ రెండో ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయనుందని తెలిపారు. ఈ కేసు ఎంత వరకు వచ్చిందో సమీక్ష జరిపిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించారంటూ ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పోలీసింగ్‌ను దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. విప్లవాత్మక మార్పులతో ఇప్పటికే తాము అగ్రస్థానంలో కొనసాగుతున్నామని, పోలీసింగ్ వ్యవస్థలో 'ఏఐ'ని తీసుకువస్తామని తెలిపారు. మహిళల భద్రత, చైల్డ్ అండ్ ఉమెన్ ట్రాఫికింగ్, డ్రగ్స్ దందాపై దృష్టి సారిస్తామని అన్నారు. పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుని, ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నక్సలైట్ల నిర్మూలనకు గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను సరైన రీతిలో ఉపయోగించుకుంటామని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను వివిధ రకాలుగా మోసం చేస్తున్నారని, అలాంటి నేరాలను అదుపు చేసేందుకు జిల్లాల వారీగా ఎస్పీలు కార్యాచరణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సింగర్ మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ కేసుపై కూడా డీజీపీ స్పందించారు. ఈ కేసుకు సంబంధించి తనకు పూర్తి సమాచారం లేదని తెలిపారు. ఈ కేసుపై సమీక్ష జరిపిన తర్వాత చెబుతానని అన్నారు.

## విశాఖ ఉక్కుకు 8,097 కోట్ల అదనపు ప్యాకేజీ!

విశాఖపట్నం, మే 1 (ఈవార్తలు): ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కి, ప్రస్తుతం నిలకడగా కొనసాగుతున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రెండో విడత ఆర్థిక ప్యాకేజీని ప్రకటించనుంది. గత ఏడాది అందించిన రూ. 11,440 కోట్ల సాయానికి అదనంగా, ఇప్పుడు మరో రూ. 8,097 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర ఉక్కు శాఖ రంగం సిద్ధం చేసింది. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ ప్యాకేజీకి సంబంధించిన ఫైల్‌ను ఇప్పటికే క్లియర్ చేశారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనను ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపించారు. ఆర్థిక శాఖలోని వ్యయ విభాగం దీనికి పచ్చజెండా ఊపిన వెంటనే, ఈ అంశం తుది ఆమోదం కోసం కేంద్ర మంత్రివర్గం ముందుకు వెళ్లనుంది. తొలి దశలో అందించిన సాయం తరహాలోనే, ఈ రూ. 8,097 కోట్లను కూడా ఈక్విటీ రూపంలోనే సమకూర్చాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల ప్లాంట్‌పై రుణ భారం పడకుండా, మూలధనం పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిపిన సంప్రదింపులతో తొలి దశలో రూ. 11,440 కోట్ల ప్యాకేజీ అందింది. ఇందులో రూ. 10,300 కోట్లు ఈక్విటీగా, మిగిలిన రూ. 1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ రుణాల రూపంలో అందాయి. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి రావడంతో కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఉక్కు ఉత్పత్తి, అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఈ పురోగతి దీర్ఘకాలం పాటు కొనసాగాలంటే అదనపు నిధుల అవసరం ఉందని గుర్తించిన కేంద్రం, ఈ రెండో దశ ప్యాకేజీ ద్వారా ప్లాంట్‌ను పూర్తిస్థాయి లాభాల బాటలోకి తీసుకురావాలని భావిస్తోంది.

# భర్తను చంపిన నెలలోపే ప్రియుడితో పెళ్లి

## టెకీ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు



హైదరాబాద్, మే 1 (ఈవార్తలు): హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారం ఆత్మహత్య, దాని వెనుక ఉన్న కుటుంబ కలహాలు, దానికి సంబంధించి వస్తున్న పరిణామాల నేపథ్యంలో భారీ ట్విస్ట్ చోటు చేసుకుంది. సీతారాం బలవన్మరణానికి పాల్పడిన నేపథ్యంలో ఆ తర్వాత అతని భార్య.. చేసిన పరిణామాలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. సీతారాం చనిపోయిన తర్వాత నెలరోజుల్లోనే ఆయన భార్య ప్రియుడితో మరో పెళ్లి చేసుకున్నట్లు తాజాగా వెల్లడి కావడం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం తన భార్య ప్రవర్తన పట్ల తీవ్ర మనస్థాపానికి గురై.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుని చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సీతారాం పెళ్లికి ముందు.. ఆ తర్వాత కొనసాగిన సంబంధాలు.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వెలుగులోకి వస్తున్న ప్రైవేట్ వీడియోలు ఘటనలు సీతారాంను మానసికంగా పూర్తిగా కుంగదీశాయని తెలుస్తోంది. తనకు భార్యాభర్తల మధ్య తలెత్తిన సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రయత్నాలు చేసినా అవి మారకపోవడంతో సీతారాం ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడి అవుతోంది. దాదాపు 19 పేజీల సూసైడ్ నోట్ రాసి.. ఇక బతకడం వృథా అని తెలిసిన సీతారాం.. తాను ప్రాణాలు తీసుకోవడమే సరైందని భావించి ఆ నిర్ణయం తీసుకున్నట్లు అర్థం అవుతోంది. ఇక ఆ 19 పేజీల ఆత్మహత్య లేఖలో తన బాధ, అవమానం, నమ్మక ద్రోహం వంటి అన్ని వివరాలను కూలంకషంగా వివరించిన సీతారాం.. తన సూసైడ్ లెటర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఈ కేసు మరింత వైరల్ కావడానికి కారణం అయింది. సీతారాం ఆత్మహత్య కేసు సంచలనంగా మారింది. భార్య వివాహేతర సంబంధాల గురించి పచ్చి నిజాలు తెలుసుకున్న సీతారాం.. అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు రాసిన 19 పేజీల సూసైడ్ లెటర్‌లో తన భార్య బూతు పురాణం గురించి సంచలన విషయాలు వెల్లడించాడు. తన భార్య రేణుకకు పెళ్లికి ముందే 6 ప్రేమ కథలు ఉన్నాయని.. తనతో వివాహం జరిగాక.. ముగ్గురితో వివాహేతర సంబంధాలు పెట్టుకుందని తెలిపాడు. పైగా అఫైర్ పెట్టుకున్న వ్యక్తులతో సన్నిహితంగా ఉన్నప్పుడు వీడియోలు తీసి.. వాటిని తన ప్రియుడికి పంపేదని.. వాటిని అతడు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడని సీతారాం తెలిపాడు. ఈ క్రమంలో ఈ కేసులో తాజాగా దిమ్మతిరిగే ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. భార్య బాగోతం భరించలేని సీతారాం ఆత్మహత్య చేసుకుని చనిపోగా.. అతడి భార్య రేణుక మాత్రం నెల తిరగకముందే తన ప్రియుడిని వివాహం చేసుకుంది. సీతారాం ఆత్మహత్య చేసుకున్న నెల రోజుల్లోపే రేణుక తన ప్రియుడు రమణారెడ్డిని వివాహం చేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం పోలీసులు వీరిద్దరినీ అరెస్ట్ చేశారు. ఇదిలా ఉంటే సీతారాం, రేణుక దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అటు తండ్రి సీతారాం ఆత్మహత్య చేసుకోవడం.. ఇటు వాళ్ల తల్లి జైలు పాలు కావడంతో వారికి పుట్టిన ఇద్దరు పిల్లలు ఇప్పుడు అనాథలు అయ్యారు. మరోవైపు.. తన కొడుకు కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీతారాం తల్లిదండ్రులు ఆరోపిస్తుండటం గమనార్హం.

# మోదీ మేడే గిఫ్ట్ ఇదే

### వాణిజ్య సిలిండర్ పెంపుపై కేటీఆర్ చురక




హైదరాబాద్, మే 1 (ఈవార్తలు): ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అలవాటుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 80 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మేడే కానుకగా హోటల్ కార్మికులకు ఇచ్చిన బహుమతి కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడమేనని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను కేటీఆర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. సిగాచీ పరిశ్రమలో కార్మికులు ప్రమాదంలో చనిపోతే వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీర శూరకర్ణలా మాట్లాడారని, ఎన్నికలు అయ్యాక కుంభకర్ణుడిలా మారిపోయాడని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు జేమ్స్ బాండ్‌లా బాండు పేపర్లు ఎందుకు రాసిచ్చారని ప్రశ్నించారు. హామీల గురించి అడిగితే బూతులు తిడుతున్నారని ధ్వజమెత్తారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ఎలా ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్ రెడ్డి లాంటి సీఎంను చూడలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఎలాగూ మరోసారి ముఖ్యమంత్రి కాబోరని, కానీ ఉన్నన్నాళ్లైనా నాలుగు మంచి పనులు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కార్మికులు అంటే రేవంత్ రెడ్డికి లెక్కలేదని అన్నారు. తాను కొన్ని కొన్ని నెలల క్రితం పార్టీ కార్యాలయం వద్ద కారు అందుబాటులో లేకపోవడంతో మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోను ఎక్కానని తెలిపారు. ఆ సమయంలో ఆయనతో మాట్లాడానని, ఆయన చెప్పిన విషయాల విని ఆందోళన చెందానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే మస్రత్ అలీ ఆటోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్కారని, ఆ సమయంలో అతనికి రెండు ఆటోలు ఉండేవని చెప్పారు. రాహుల్ గాంధీ ఎక్కిన తర్వాత ఆయన తన ఆటోలను అమ్మేసుకుని కిరాయి ఆటో నడుపుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కొందరి అడుగు అలా ఉంటుందని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు.

## అమరావతిలో బసవతారకం ఆస్పత్రికి శంకుస్థాపన

అమరావతి, మే 1 (ఈవార్తలు): దశాబ్దాలుగా క్యాన్సర్ బాధితులకు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి అసమాన సేవలను అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు హైదరాబాద్ నుంచే సేవలను అందించిన బసవతారకం ఆసుపత్రి... ఇప్పుడు ఏపీకి విస్తరిస్తోంది. ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలో తుళ్లూరు వద్ద బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. బసవతారకం ఆసుపత్రి చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... అమరావతి నిర్మాణం కోసం వేల ఎకరాల భూములను ఇచ్చిన రైతులకు, మహిళలకు పాదాభివందనం చేస్తున్నానని బాలయ్య అన్నారు. వారి సహకారం వల్లే ఇలాంటి భారీ ప్రాజెక్టులు సాధ్యమవుతున్నాయని ఆయన చెప్పారు.

# నిరుద్యోగంతో అమెరికాలో ఏపీ యువకుడి ఆత్మహత్య



కర్నూలు, మే 1 (ఈవార్తలు): ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఒక ఆంధ్రా యువకుడు.. అక్కడే ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. అందమైన భవిష్యత్తును వెతుక్కుంటూ వెళ్లిన ఆ యువకుడు.. ఉద్యోగం దొరక్క.. కుటుంబానికి భారమయ్యానన్న వేదనతో అక్కడే బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన 26 ఏళ్ల ఇరగనబోయిన చందు మరణం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో తీరని విషాదాన్ని నింపింది. చందు చికాగోలోని డిపాల్ యూనివర్సిటీ నుంచి ఇటీవల మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. తన తమ్ముడికి ఆదర్శంగా ఉండాలని, సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న తన తండ్రి కష్టాలను తీర్చాలని ఎన్నో కలలతో అమెరికా గడ్డపై అడుగు పెట్టాడు. అయితే చదువు పూర్తయిన తర్వాత గత కొన్ని వారాలుగా ఆయన ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ వరుస ప్రయత్నాలు విఫలం కావడం, ఆర్థికంగా కుటుంబంపై ఆధార పడాల్సి రావడంతో చందు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. తండ్రి పడుతున్న శ్రమ, కుటుంబంపై ఉన్న అప్పుల భారం ఆయనను మరింత కుంగదీశాయి. చివరకు నిరుద్యోగ బాధను తట్టుకోలేక తన గదిలోనే ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాడు. చందు మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడం ఆ నిరుపేద కుటుంబానికి భారంగా మారింది. మృతదేహ తరలింపు, ఇతర చట్టపరమైన అనుమతులకు దాదాపు 25 వేల డాలర్లు ( భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 21 లక్షలు) ఖర్చు అవుతుందని అంచనా. ఈ నేపథ్యంలోనే అమెరికాలోని ప్రవాస భారతీయులు మానవత్వం చాటుకున్నారు. చందు మృతదేహ తరలింపుతో పాటు ఆయన తండ్రి చేసిన అప్పులను తీర్చేందుకు.. విరాళాల సేకరణ ప్రారంభించారు. 1,20,000 డాలర్ల లక్ష్యంతో చేపట్టిన ఈ సేకరణకు భారీ స్పందన లభిస్తోంది. కేవలం రెండు రోజుల్లోనే 76,000 డాలర్లకు పైగా విరాళాలు అందాయి. ఈ విషాద వార్త సామాజిక మాధ్యమాల ద్వారా ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే స్పందిస్తూ.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు.. మృతదేహాన్ని భారత్‌కు వేగంగా చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## కవిత వల్లే కేసీఆర్ బయటికి: మహేశ్ గౌడ్

హైదరాబాద్, మే 1 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని చెరువుల కబ్జాల విముక్తి కోసం ప్రభుత్వం చేపట్టిన హైడ్రా చర్యలపై కేసీఆర్ అభ్యంతరం చెప్పడాన్ని పీసీసీ చీఫ్ తప్పుపట్టారు. నగరం చుట్టూ ఉన్న చెరువులను బీఆర్ఎస్ నాయకులే కబ్జా చేశారని, అందుకే హైడ్రా వల్ల ఆ పార్టీ నేతలకు ఇబ్బంది కలుగుతోందని ఎద్దేవా చేశారు. చెరువులను కబ్జాల నుండి విముక్తి చేస్తే కేసీఆర్ కి వచ్చిన ఇబ్బంది ఏంటని ఆయన నిలదీశారు. హైడ్రా నిబంధనల గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవు పలికారు. టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత వల్లే కేసీఆర్ మళ్లీ మేల్కొంటున్నారని, ఆమె భయం వల్లే ఆయన బయటకు వస్తున్నారని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కవితకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ ప్రజల కోసం కాకుండా రాజకీయ ఉనికి కోసమే బయటకు వస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేస్తున్నామని చెబుతూనే, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా మహేశ్ గౌడ్ కొన్ని కీలక ప్రకటనలు చేశారు.

## గుంటూరులో సెక్స్ మసాజ్

గుంటూరు, మే 1 (ఈవార్తలు): ఏపీలోని గుంటూరు నగరంలో స్పా, మసాజ్ సెంటర్ ముసుగులో జరుగుతున్న వ్యభిచార దందాను గుంటూరు జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు, రెడ్డిపాలెం వద్ద ఉన్న 'ఐరా స్పా' సెంటర్‌పై గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు మహిళలతో పాటు స్పా మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల నుంచి అందిన పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ బృందం గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో ఈ స్పా సెంటర్‌పై ఆకస్మిక దాడి చేసింది. కొంతకాలంగా మసాజ్ పేరుతో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో స్పా మేనేజర్‌గా పనిచేస్తున్న సూర్య అనే వ్యక్తితో పాటు ముగ్గురు మహిళలను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన మహిళల్లో ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని విచారణలో తేలింది.

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## సామాన్యుడికి కేంద్రం మోసం

### వాణిజ్య సిలిండర్ ధరల పెంపు దారుణం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, మే 1 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ ధరలు పెంచడం వల్ల ఆ ప్రభావం అంతిమంగా సామాన్యుడిపై పడుతుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ.993 పెంచారని, దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, వీధి వ్యాపారులు, బేకరీలపై పెను భారం పడుతుందని అన్నారు. ఇది సామాన్యులకు ఆర్థిక భారమే అన్నారు. ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడమంటే ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు ఈరోజు భారీగా పెరిగిన విషయం తెలిసిందే.

## వద్దన్నా వరంగల్‌ను 6 ముక్కలు చేశారు

### కేసీఆర్‌పై కడియం శ్రీహరి ఆగ్రహం

వరంగల్, మే 1 (ఈవార్తలు): వరంగల్ జిల్లాను కేసీఆర్ ఆరుముక్కలు చేశారని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. జిల్లాను ముక్కలు చేయవద్దని తాను బతిమాలినప్పటికీ, ఆరు ముక్కలు చేసి ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పైకి వరంగల్ జిల్లా అని చెప్పుకోవడం తప్ప మిగిలిందేమీ లేదని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ అహంకారం నచ్చకపోవడంవల్లే కొందరు నాయకులు దూరంగా ఉంటున్నారని అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 36 మంది ఎమ్మెల్యేలను ఇతర పార్టీల నుంచి చేర్చుకున్నారని విమర్శించారు. పార్టీలో చేరిన వారు ఎవరూ రాజీనామా చేయకపోయినప్పటికీ మంత్రి పదవులు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. మీరు చేస్తే రాజకీయం, ఇతరులు చేస్తే వ్యభిచారమా అని నిలదీశారు. ఇది కేసీఆర్ నేర్పిన విద్యే అన్నారు. కేసీఆర్ తీరు నచ్చకపోవడం వల్లే ఆయన నాయకత్వం నుంచి చాలామంది బయటకు వస్తున్నారని అన్నారు. కేసీఆర్ అహంకారం ఎవరికీ నచ్చడం లేదని అన్నారు.

## నా బయోపిక్ నేనే తీస్తా: మల్లారెడ్డి

మేడ్చల్, మే 1 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో తనదైన ట్రేడ్ మార్క్ స్పీచ్‌లతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఇప్పుడు సినిమాల గురించి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తన జీవితకథను సినిమాగా తీయాలని ఉందని... ఆ సినిమాను తానే తీస్తానని ఆయన అన్నారు. పవన్ కల్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'లో విలన్ పాత్ర కోసం తనను సంప్రదించారని... తాను ఒప్పుకోలేదని మల్లారెడ్డి చెప్పారు. విలన్ అంటే హీరో చేతిలో దెబ్బలు తినాల్సి ఉంటుందని, వేలాది మంది తన విద్యార్థులు, అభిమానుల ముందు అలా కనిపించడం తనకు ఇష్టం లేదని ఆయన స్పష్టం చేశారు. తాను త్వరలోనే సినిమాల్లోకి వస్తానని మల్లారెడ్డి తెలిపారు. తన పాత్రకు ఏ హీరో సెట్ అవుతారని డైరెక్టర్ చెబుతారో ఆయననే తీసుకుంటామని... ఆ సినిమాలో తాను కూడా ఒక ప్రధాన పాత్రలో నటిస్తానని చెప్పారు.



## వృద్ధుల డే కేర్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

జగిత్యాల, మే 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణలో బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్ "ప్రణామ్"ను రాష్ట్ర మహిళా, శిశు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజ్‌కుమార్ కాంబ్లేతో కలిసి కేంద్రాన్ని సందర్శించిన ఆమె అక్కడి వసతులు, నిర్వహణ తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర నిర్వహణపై ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యనిర్వాహక సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ వివరాలు తెలియజేశారు. వసతులపై సంతృప్తి వ్యక్తం చేసిన కార్యదర్శి, సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు భాస్కర్, ఉద్యోగులు కొండయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

ధర్మపురి, మే 1 (ఈవార్తలు): ధర్మపురిలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు వేగం పుంజుకున్నాయి. ధర్మారం మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రామయ్యపల్లె సర్పంచ్ మూలమంగ మల్లేశం (బీఆర్ఎస్), బొమ్మారెడ్డిపల్లి సర్పంచ్ ధారా రాజకుమార్ (స్వతంత్ర) తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కొత్తగా చేరిన నాయకులకు సూచించారు.

## లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ధర్మపురి, మే 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దిపేటకు చెందిన షేక్ ముస్తఫా (38) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, ముస్తఫా తన భార్య సాహిం బేగంతో కలిసి ఉపాధి కోసం కొడిమ్యాలలో నివసిస్తున్నాడు. గ్రామాల వారీగా తిరుగుతూ గ్యాస్ స్టవ్‌లు రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం ధర్మపురిలోని బంధువుల ఇంటికి వచ్చి, అనంతరం తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ గ్రామానికి చేరుకోగానే రాయపట్నం నుంచి ధర్మపురి వైపు వస్తున్న లారీ (టీఎస్ 16 యూబి 7707) ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముస్తఫాకు తలతో పాటు శరీరంలోని ఇతర భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు షేక్ ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై ధర్మపురి ఎస్ఐ రవీందర్ వివరాలు వెల్లడించారు.



## ప్రాణాలు తీసే రోడ్డు

**పగిలిన రోడ్లు.. ప్రమాదాల బారిన ప్రజలు**

వెల్గటూర్, మే 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామ శివారులోని బ్రిడ్జి ప్రాంతంలో రహదారి ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారిపై భాగం పగిలిపోవడంతో పాటు రోడ్డు ఉపరితలం పైకి లేచిపోయి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ మార్గంలో ప్రతిరోజూ గ్రామస్థులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండగా, రహదారి దెబ్బతినడం వల్ల ప్రమాదాల భయం నెలకొంది. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు రోడ్డు పరిస్థితిని ముందుగానే గమనించకపోతే అదుపుతప్పి కిందపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వెలుతురు సరిగా లేకపోవడం వల్ల పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని చెబుతున్నారు. ఇప్పటికే పలువురు వాహనదారులు స్వల్ప గాయాలతో బయటపడ్డ సంఘటనలు జరిగినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. చెగ్యాం గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గం కావడంతో ఈ రహదారిపై ఎప్పుడూ రద్దీగా వాహనాలు సంచరిస్తుంటాయి. అయినప్పటికీ ఇప్పటివరకు సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు సంభవించేలోపు వెంటనే దెబ్బతిన్న రహదారిని సరిచేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, వాహనదారుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## వైభవంగా లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణం

**పాల్గొన్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

మేడిపెల్లి, మే 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, స్వామివారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర సాధనలో ఆర్టీసీది గొప్ప పాత్ర

**రేవంత్ నాయకత్వానికి మద్దతివ్వండి.. మేడే వేడుకల్లో కార్మికులకు అడ్లూరి వినతి**

జగిత్యాల, మే 1 (ఈవార్తలు): ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా జగిత్యాల ఆర్టీసీ బస్ డిపోలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికులు, సింగరేణి కార్మికులు పోషించిన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సమ్మెకు దిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు హెచ్చరించారని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మికులు పోరాడినప్పటికీ, గత ప్రభుత్వం చర్చలకు కూడా పిలవలేదని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన మూడు రోజుల్లోనే వారి సమస్యలను పరిష్కరించామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఐదుగురు మంత్రులు, 24 సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి సమ్మెకు ముగింపు పలికినట్లు వివరించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా రాష్ట్రంలోని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆర్టీసీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు శంకర్, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బాలల భరోసా ప్రభుత్వ లక్ష్యం**

జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం మేడే వేడుకలతో పాటు 'బాల భరోసా', 'నషా ముక్త్' కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఆరేళ్ల వయస్సు వరకు పిల్లలు అంగవైకల్యానికి గురికాకుండా చూడటం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ క్రమంలో 'బాల భరోసా' కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 18 లక్షల చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించినట్లు వెల్లడించారు. అవసరమైతే హైదరాబాద్‌లో చికిత్స అందించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని అన్నారు. ఇటీవల ఆర్టీసీ కార్మికుల సమస్యలను మూడు రోజుల్లో పరిష్కరించామని గుర్తుచేశారు. అసంఘటిత కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'నషా ముక్త్' కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, స్కూటీలు, ఈ–ఆటోలు పంపిణీ చేశారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ మాట్లాడుతూ దివ్యాంగులకు పరికరాల కోసం భారీగా నిధులు కేటాయించామని తెలిపారు. డైరెక్టర్ శైలజా మాట్లాడుతూ చిన్నారుల్లో వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా భవిష్యత్తులో సమస్యలు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ , జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలకు నిధులేవి?

**ప్రభుత్వంపై జీవన్ రెడ్డి ఫైర్**

జగిత్యాల రూరల్, మే 1 (ఈవార్తలు): మేడే దినోత్సవం సందర్భంగా జగిత్యాల రూరల్ మండలం చల్గల్ గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు జీవన్ రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ జున్ను రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత , హరిచరణ్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ కార్మికులను సన్మానించారు. సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ భవిష్యత్తు అని, గ్రామపంచాయతీలకు తగిన నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు తప్ప రాష్ట్రం నుంచి సరైన మద్దతు లభించడం లేదని విమర్శించారు. పారిశుద్ధ కార్మికుల వేతనాలను ప్రభుత్వం నేరుగా చెల్లించాలని, అప్పుడే స్థానిక సంస్థలపై భారం తగ్గుతుందని సూచించారు. గతంలో ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని, ప్రస్తుతం రైతుల సమస్యలు పెరిగాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని విమర్శించారు. గ్రామపంచాయతీలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని, కార్మికులకు పీఎఫ్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జున్ను రాజేందర్, ఉప సర్పంచ్ మహమ్మద్ రొమాన్, అగ్రికల్చర్ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ఆసిఫ్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



**వెంకన్న కల్యాణంలో మాజీమంత్రి**

రాయికల్, మే 1 (ఈవార్తలు): రాయికల్ మండలం మూటపెల్లి, భూపతిపూర్ గ్రామాల్లో శ్రీ వెంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి , మాజీ జడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రవీందర్, సర్పంచ్ గుర్రం భావన, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జగిత్యాల, మే 1 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 19వ వార్డు శంకులపల్లి ప్రాంతంలో మేప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కౌన్సిలర్లు ఏనుగుల లావణ్య రాజు, కూతురు శేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్లు కొలుగురి దామోదర్ రావు, నక్కల రాధా రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, కుసరి అనిల్, జిల్లా యువజన అధ్యక్షుడు భీరం రాజేష్, సీనియర్ నాయకులు బాలముకుందం, రవీందర్ రావు, రాజు, సాగర్, గంగాధర్, మేప్మా అధికారులు శ్రీనివాస్, టీఎంసీ రజిత, లావణ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల అస్తిత్వం ఇందిరమ్మ ఇల్లు

**గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే సంజయ్ వ్యాఖ్యలు**

జగిత్యాల, మే 1 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలంలోని గొల్లపల్లి, జాబితాపూర్ గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో జగిత్యాల ఎమ్మెల్యే. సంజయ్ కుమార్ పాల్గొన్నారు. గొల్లపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఏక్కల్ దేవి తిరుపతి గంగరాజు, జాబితాపూర్ గ్రామానికి చెందిన లక్కం జల విజయ్‌లకు మంజూరైన ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కానుకగా చీరను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని తెలిపారు. ప్రభుత్వం పేదలకు గృహ వసతి కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, సర్పంచ్ ప్రకాష్, మాజీ ఏఎంసీ చైర్మన్లు కొలుగురి దామోదర్ రావు, నక్కల రాధా రవీందర్ రెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ సదాశివ రావు, ఉపసర్పంచ్ మల్లేశం, మాజీ సర్పంచ్ బాలముకుందం, మల్లారెడ్డి, అంకం సతీష్, మాజీ ఎంపీటీసీ శంకర్, రవీందర్ రావు, శాంతపు రావు, విజయ్, కొమురయ్య, ఎంపీవో రవి బాబు, ఉపసర్పంచ్ సత్తిరెడ్డి సూర్య ప్రకాష్, మహేష్, రాజా గౌడ్, మహిపాల్, మహేష్, సంతోష్, రాజ్‌కుమార్, అశోక్, తిరుపతి, దనేశ్వర్ రావు, వార్డు సభ్యులు రాజకుమార్, కందుల లాస్య శేఖర్ గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌కు డీఎస్పీగా పదోన్నతి

జగిత్యాల, మే 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పోలీస్ శాఖలో డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ ఆయనను అభినందించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా ప్రజా భద్రత కోసం చేసిన సేవలకు ఇది గుర్తింపని పేర్కొన్నారు. పదోన్నతి ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయని, ఇకపై మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## అదుపుతప్పి సిమెంట్ లారీ బోల్తా

**తృటిలో తప్పిన ప్రమాదం..**

కోరుట్ల, మే 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మోహన్‌రావుపేట్ బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఉదయం సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. జగిత్యాల నుంచి నిజామాబాద్ వైపు సిమెంట్ లోడుతో ప్రయాణిస్తున్న లారీ, మోహన్ రావుపేట్ బస్టాండ్ సమీపానికి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో రోడ్డుపై పక్కకు ఒరిగి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో రహదారిపై వాహన రాకపోకలు తక్కువగా ఉండటం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లు స్వల్పంగా బయటపడగా, ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ప్రమాదంతో రోడ్డుపై కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా, స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని పక్కకు తొలగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు కవిత మీట్ ది ప్రెస్

హైదరాబాద్, మే 1 (ఈవార్తలు): కొత్తగా ఏర్పాటైన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియా ముందుకు రానున్నారు. మే 2వ తేదీ (శనివారం) ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగే 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఈ కార్యక్రమాన్ని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంపై కవిత స్పందిస్తూ, తన కొత్త పార్టీని విజయవంతంగా ప్రారంభించిన అనంతరం జర్నలిస్టులతో సమావేశమవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన తమ పార్టీ సమగ్ర దార్శనికతను, రాష్ట్ర ప్రగతి కోసం రూపొందించిన రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా పంచుకుంటానని ఆమె పేర్కొన్నారు.

నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811
Email: contact@evarthalu.com

## జీపు లోయలో పడి 17 మంది మృతి

**నేపాల్‌లో ఘోర ప్రమాదం**

ఖట్మండు: నేపాల్‌లో గురువారం ఘోర ప్రమాదం సంభవించింది. కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న జీపు అదుపుతప్పి లోయలో పడిపోయిన ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన రోల్పా జిల్లాలో చోటుచేసుకుంది. బాధితులు జల్‌జలాలో జరిగే వైశాఖ పౌర్ణమి వేడుకలకు ప్రయివేట్ జీపులో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పర్వత ప్రాంత రహదారి, ఆపై వర్షం కురువడం వల్ల బురదమయమైంది. దీంతో వాహనం జారి లోయలోకి దూసుకెళ్లిందని పోలీసులు తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు చెప్పారు. అయితే, ప్రమాద సమయానికి జీపులో ఎంతమంది ఉన్నారనేది ఇంకా స్పష్టత లేదని అధికారులు పేర్కొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బాధితులను గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. రోల్పా జిల్లాలోని రుక్మమ్ పూర్బ నుంచి వెళ్తుండగా.. థవాంగ్ రూరల్ మున్సిపాల్టీ జల్‌జలా సమీపంలోనే ప్రమాదం జరిగినట్టు చెప్పారు.

## ట్రంప్ బాలల హంతకుడు: ఇరాన్

టెహ్రాన్: పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ, ఇరాన్, అమెరికా మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఇరాన్ అధ్యక్ష కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారి సయ్యద్ మెహదీ తబాతబాయి.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను 'పిల్లల హంతకుడు' అని సంబోధిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా వెంటనే తమకు నష్టపరిహారం చెల్లించి, ఈ ప్రాంతం విడిచి వెళ్లిపోవాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అమెరికా చౌకబారు మైండ్ గేమ్స్, వాక్చాతుర్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. "శాంతి, స్నేహాన్నే ఇరాన్ ఎల్లప్పుడూ కోరుకుంటుంది. కానీ, ఎవరైనా మాతో బలప్రయోగం చేసే భాషలో మాట్లాడితే, వారికి కఠినమైన చెంపదెబ్బ తప్పదు" అని ఆయన హెచ్చరించారు. "పిల్లల హంతకుడు తవ్విన గొయ్యి నుంచి అమెరికా అధికారులు బయటపడి, తమ దేశానికి తిరిగి వెళ్లాలి" అని తబాతబాయి ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణకు ముందు అమెరికా, ఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడుల్లో పౌరులు మరణించారని ఇరాన్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా, మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడిలో వంద మందికి పైగా బాలికలు మరణించారని ఇరాన్ చెబుతోంది.

## మమత కదలికలపై నిఘా: సువేందు అధికారి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కదలికలపై నిఘా ఉంచామని ప్రతిపక్ష నేత సువేందు అధికారి తెలిపారు. నిన్న భవానీపూర్‌లోని ఓ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లో మమతా బెనర్జీ దాదాపు నాలుగు గంటల పాటు ఉన్నారు. దీనిపై సువేందు స్పందించారు. ఎన్నికల ఫలితాలకు ముందు ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు నిఘా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మమతా బెనర్జీ అక్కడ ఉన్నంతసేపు తమ ఏజెంట్ ఆమె కదలికలను గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ఇతర ప్రాంతాలలోని స్ట్రాంగ్ రూంల వద్ద కూడా తమ నేతలు నిఘా ఉంచారని పేర్కొన్నారు. ఆమె ఎంత ప్రయత్నించినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించకుండా తాము అడ్డుకున్నామని వెల్లడించారు.

## ఇరాన్‌తో యుద్ధం ముగిసింది: ట్రంప్


వాషింగ్టన్: ఇరాన్-అమెరికా యుద్ధానికి సంబంధించి తాజాగా వైట్ హౌస్ ఒక సంచలన ప్రకటన చేసింది. ఇరాన్‌తో యుద్ధం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాంగ్రెస్‌కు అధికారికంగా లేఖ రాసినట్టు తెలుస్తోంది.అయితే గత ఏప్రిల్ 7 నుంచి ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఎలాంటి దాడులు జరగలేదని..ఈ క్రమంలోనే ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం ఇప్పుడు అధికారికంగా ముగిసిందని వైట్ హౌస్ ప్రకటించింది. ఇరాన్‌తో యుద్ధం కొనసాగింపునకు 60 రోజుల్లో కాంగ్రెస్ అనుమతి తప్పనిసరి. కాంగ్రెస్ నుంచి అనుమతి పొందాల్సిన గడువు మే 1తో ముగిసిన నేపథ్యంలో ఈ మేరకు వైట్ హౌస్ కీలక ప్రకటన చేసింది. యుద్ధం నిలిపివేతపై అధ్యక్షుడు ట్రంప్ సందేశాన్ని శ్వేతసౌధం కాంగ్రెస్‌కు తెలిపింది. ఇరాన్‌తో ఏప్రిల్ 7న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఆ ఒప్పందాన్ని ట్రంప్ పొడిగిస్తూ వచ్చారు.

## భారీ ఉగ్రదాడికి మునీర్ కుట్ర

న్యూఢిల్లీ: భారత గడ్డపై మరో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోందని, ఈసారి జమ్మూకశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోందని విశ్వసనీయ నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్ ను ప్రతీకార దాడులకు పురిగొల్పి, ఆ తర్వాత అమెరికా వంటి దేశాల జోక్యాన్ని కోరడం ద్వారా కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లాలనేది పాక్ పన్నాగంగా కనిపిస్తోంది. ఈ మొత్తం వ్యూహం వెనుక పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ వ్యక్తిగత, రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. దేశీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న అసిమ్ మునీర్, తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి భారత్‌పై ఒక పెద్ద దాడిని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆయన దృష్టి మళ్లీ భారత్‌పైకి మళ్లింది. కశ్మీర్ అంశాన్ని రగిలించడం ద్వారా పాకిస్థాన్‌లో తన ఇమేజ్‌ను పెంచుకుని, భవిష్యత్తులో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలనేది ఆయన దీర్ఘకాలిక ప్రణాళిక అని ఓ అధికారి తెలిపారు. ఇందుకోసం మునీర్ రెండంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మొదటి దశలో, కశ్మీర్‌లోని స్థానిక యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించి, చిన్నచిన్న దాడులు చేయించడం ద్వారా లోయలో అశాంతిని సృష్టించడం. దీనివల్ల పర్యాటక రంగం దెబ్బతినడంతో పాటు సరిహద్దుల్లో మోహరించిన భారత భద్రతా బలగాల దృష్టిని అంతర్గత భద్రత వైపు మళ్లించవచ్చు. రెండో దశలో, ఈ అదను చూసి సరిహద్దుల్లోని లాంచ్‌ప్యాడ్‌లలో సిద్ధంగా ఉన్న పెద్ద సంఖ్యలోని పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించి, ఒక భారీ దాడికి పాల్పడటం వారి వ్యూహంలో భాగం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అది తమ అంతర్గత వ్యవహారమని భారత్ గట్టిగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ చేత సైనిక చర్యకు ఆస్కారం కల్పించి, దానిని సాకుగా చూపి అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకునేలా చేయాలన్నదే మునీర్ అసలు లక్ష్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పవన్ ఖేరాకు ఊరట

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ భార్య రిణికి భూయాన్ శర్మపై అనుచిత వ్యాఖ్యల కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ముందస్తు బెయిల్ ఇవ్వడానికి గౌహతి హైకోర్టు నిరాకరించడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందుర్కర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందస్తు బెయిల్ ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది. తనకు పలు పాస్‌పోర్టులు ఉన్నాయని, విదేశీ ఆస్తులు ఉన్నాయంటూ కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలపై రిణికి భూయాన్ శర్మ గౌహతిలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా అభ్యర్థించగా, గౌహతి హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పవన్ ఖేరా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు.



# యూపీఐ.. చెల్లింపుల రాజా!

## పదేళ్లలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు

**భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ తన అప్రతిహత జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో లావాదేవీల సంఖ్య, విలువ పరంగా గణనీయమైన వృద్ధి నమోదైంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా 22.35 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి.**

న్యూఢిల్లీ: వీటి మొత్తం విలువ రూ.29.03 లక్షల కోట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25%, విలువలో 21% వృద్ధి కనిపించింది. రోజువారీ లావాదేవీల పరంగా కూడా ఈ వృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. మార్చిలో రోజుకు సగటున 730 మిలియన్ల లావాదేవీలు జరగగా, ఏప్రిల్‌లో ఈ సంఖ్య 745 మిలియన్లకు పెరిగింది. అలాగే, రోజువారీ లావాదేవీల సగటు విలువ రూ.95,243 కోట్ల నుంచి రూ.96,766 కోట్లకు చేరింది. ఇదే నెలలో ఐఎంపీఎస్ ద్వారా 362 మిలియన్ల లావాదేవీలు జరగ్గా, వాటి విలువ రూ.7.01 లక్షల కోట్లుగా నమోదైంది. భారత్ గర్వించదగ్గ యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సేవలు కేవలం దేశానికే పరిమితం కాలేదు. ఇప్పటికే యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా 8కి పైగా దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అంతర్జాతీయ విస్తరణ ద్వారా విదేశాల నుంచి డబ్బు పంపడం సులభతరం అవ్వడమే కాకుండా, ప్రపంచ ఫిన్‌టెక్ రంగంలో భారత్ స్థానం మరింత పటిష్ఠమవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం గత దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో దాదాపు 12,000 రెట్ల వృద్ధి నమోదైంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్ల లావాదేవీలు జరగ్గా, 2025-26 నాటికి ఆ సంఖ్య 24,162 కోట్లకు చేరింది. ఇదే సమయంలో లావాదేవీల విలువ రూ.0.07 లక్షల కోట్ల నుంచి రూ.314 లక్షల కోట్లకు పెరిగి, 4,000 రెట్ల వృద్ధిని నమోదు చేసింది. యూపీఐ పనితీరు, విశ్వసనీయత కారణంగా భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది. లావాదేవీల సంఖ్య పరంగా యూపీఐ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ పేమెంట్ సిస్టమ్ అని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సైతం గుర్తించింది.



## ఒక్క డాలర్ = 18.10 లక్షల ఇరాన్ రియాల్స్

### చరిత్రలో అత్యంత కనిష్ఠం

టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతున్న వేళ ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఆ దేశ కరెన్సీ రియాల్ విలువ బుధవారం చరిత్రలో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అంతర్జాతీయ ఫ్రీ కరెన్సీ మార్కెట్‌లో ఒక్క అమెరికా డాలర్‌తో పోలిస్తే ఇరాన్ రియాల్ విలువ ఏకంగా 18,10,000 (1.8 మిలియన్లు) మార్కును తాకింది. గత రెండు రోజుల్లోనే కరెన్సీ విలువ దాదాపు 15 శాతం మేర పడిపోవడం గమనార్హం. ఇరాన్ స్టూడెంట్ న్యూస్ ఏజెన్సీ (ఐఎస్ఎన్ఏ) వెల్లడించిన వివరాల ప్రకారం.. గత కొన్ని వారాలుగా ఇరాన్ కరెన్సీ మార్కెట్ కొంత స్థిరంగా ఉన్నప్పటికీ.. బుధవారం ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. మార్కెట్‌లో విదేశీ కరెన్సీకి డిమాండ్ విపరీతంగా పెరగడమే ఈ పతనానికి ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. కేవలం డాలర్ మాత్రమే కాకుండా, యూరో, యూఏఈకి చెందిన దిర్హామ్ కొనుగోలుకు కూడా జనం ఎగబడుతుండటంతో స్థానిక కరెన్సీ విలువ పూర్తిగా పడిపోయింది. కరెన్సీ ధరలను ట్రాక్ చేసే వివిధ వెబ్‌సైట్లు వేర్వేరు గణాంకాలను చూపుతున్నాయి. కొన్ని చోట్ల డాలర్ విలువ 1,760,000 రియాల్స్‌గా ఉంటే.. మరికొన్ని ప్రధాన ఎక్స్ఛేంజ్ మార్కెట్లలో ఇది 1,810,000 రియాల్స్ వద్ద ట్రేడ్ అవుతోంది. ఈ హెచ్చుతగ్గులు ఇరాన్ మార్కెట్‌లో నెలకొన్న అభద్రతా భావాన్ని స్పష్టం చేస్తున్నాయి. అమెరికా విధించిన నావికా దళ దిగ్బంధం కారణంగా విదేశీ వాణిజ్యం స్తంభించిపోవడం, చమురు ఎగుమతులు నిలిచిపోవడంతో దేశంలోకి విదేశీ నిధుల రాక ఆగిపోయింది. కరెన్సీ విలువ పడిపోవడంతో ఇరాన్‌లో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకుతోంది. నిత్యావసర వస్తువులు, మందులు, ఆహార పదార్థాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. యుద్ధ భయంతో ప్రజలు తమ వద్ద ఉన్న రియాల్స్‌ను విదేశీ కరెన్సీగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తుండటంతో డిమాండ్ పెరిగి, విలువ మరింత దిగజారుతోంది.

## అంతర్జాతీయ సర్వీసులకు ఎయిరిండియా బ్రేక్!

**ఏటీఎఫ్ ధరల ఎఫెక్ట్.. 100 సర్వీసులను తగ్గించుకోవాలని నిర్ణయం**

న్యూఢిల్లీ: ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక భారంగా మారిన పలు మార్గాలలో విమాన సర్వీసులను నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రోజువారీగా 100 సర్వీసులను తగ్గించుకోనుంది. ఏటీఎఫ్ ధరలు పెరిగినందున కొన్ని మార్గాలకు విమానాలను నడపడం ఆర్థిక భారంగా ఎయిరిండియా భావిస్తోంది. ఎయిరిండియా రోజుకు సగటున 1,100 సర్వీసులను నడుపుతోంది. ఇంధన వినియోగం అధికంగా ఉండి, మార్జిన్లు అంతగా లేని యూరప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి సుదూర అంతర్జాతీయ మార్గాలలోని సర్వీసులకు ప్రధానంగా కోత పెట్టనుంది. అలాగే, ఢిల్లీ, ముంబై నగరాలకు లండన్, ప్యారిస్, న్యూయార్క్, టొరంటో, శాన్‌ఫ్రాన్సిస్కో, సిడ్నీ, మెల్‌బోర్న్ నుంచి రాకపోకలు సాగించే విమానాల సంఖ్య కూడా తగ్గనుంది. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో వరుసగా రెండో నెల ఏటీఎఫ్ ధరలు పెరిగాయి. అంతర్జాతీయ విమాన సంస్థలకు ఏటీఎఫ్ ధరను 5 శాతం పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. తాజా ప్రకటనతో ఢిల్లీలో కిలోలీటర్ ఏటీఎఫ్ ధర ఐదు శాతం పెరిగి, 1,511.86 డాలర్లకు చేరుకుంది. ఇంధన ధరలు పెరగడంతో నిర్వహణ వ్యయాలు భారంగా మారుతాయని విమానయాన సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.






## ఇరాన్ విదేశాంగ మంత్రికి ఉద్వాసన!

**అధ్యక్షుడి ఆదేశాల ధిక్కరణ ఎఫెక్ట్**

**నాయకత్వంలో భగ్గుమన్న విబేధాలు**

టెహ్రాన్: అమెరికాతో శాంతి చర్చల్లో ప్రతిష్ఠంభన కొనసాగుతున్న తరుణంలో ఇరాన్ నాయకత్వంలో విబేధాలు భగ్గుమన్నాయి. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి అబ్బాసీ అరాఘ్చీని పదవి నుంచి తొలగించేందుకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘేర్ గాలిబాఫ్‌లు సిద్ధమయ్యారంటూ ఇరాన్ ఇంటర్నేషనల్ ప్రకటించిన నివేదిక సంచలనంగా మారింది. అమెరికాతో ఇరాన్ అణు చర్చల విషయంలో అధ్యక్ష కార్యాలయం ఆదేశాలను పక్కనబెట్టి.. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సూచనలను అరాఘ్చీ పాటిస్తున్నారని ఇరువురు నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నట్టు నివేదిక పేర్కొంది.గత రెండు వారాలుగా విదేశాంగ మంత్రి తమను పట్టించుకోవడం లేదని, ఆయన క్యాబినెట్ సభ్యుడిగా కాకుండా ఐఆర్జీసీ కమాండర్ అహ్మద్ వహిదికి సహాయకుడిలా వ్యవహరిస్తున్నారని పెజెష్కియాన్, గాలిబాఫ్‌ల భావిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలను ఉటంకించింది. అధ్యక్షుడు పెజెష్కియాన్‌కి సమాచారం ఇవ్వకుండా.. ఐఆర్జీసీ చీఫ్ ఆదేశాల మేరకు అరాఘ్చీ వ్యవహరిస్తున్నారని వర్గాలు తెలిపాయి. దీంతో ఆగ్రహానికి గురవుతున్న పెజెష్కియాన్, ఇది ఇలాగే కొనసాగితే అరాఘ్చీని పదవి నుంచి తొలగిస్తానని తన సహచరులకు చెప్పినట్లు ఆ నివేదిక పేర్కొంది. అయితే, ఈ విషయంపై ఇరాన్ నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు.

## మే 7న మీడియా ముందుకు సిందూర్ వీరవనితలు

న్యూఢిల్లీ: కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మరోసారి మీడియా ముందుకు రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గత సంవత్సరం పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో, భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ వివరాలను వెల్లడించేందుకు ఈ ఇద్దరు అధికారిణులు మీడియా ముందుకు వచ్చారు. వీరిద్దరు మరోసారి మీడియా ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వీరితో పాటు నేవీ కమాండర్ ప్రేరణా దేవస్థలి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ బ్రీఫింగ్‌లో వారు ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలు, ప్రాముఖ్యత, దాని వెనుక జరిగిన ప్రణాళిక వంటి విషయాల గురించి మాట్లాడే అవకాశముంది. సోఫియా ఖురేషీ గుజరాత్‌కు చెందినవారు. బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990లలో సైన్యంలో చేరారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా పని చేశారు. 2019లో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదాను పొందారు. మే 7తో ఆపరేషన్ నిర్వహించి ఏడాది పూర్తవుతుండడంతో వీరు మీడియా ముందుకు వస్తున్నట్టు తెలుస్తోంది.

# బెంగాల్‌లోని 15 చోట్ల రీ-పోలింగ్


**మరో 30 చోట్ల నిర్ణయం తీసుకోనున్న ఈసీ**



కోల్‌కతా: పశ్చిమ్ బెంగాల్‌లోని రెండు నియోజకవర్గాల్లోని 15 బూత్‌లలో రీ-పోలింగ్ నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషన్ శుక్రవారం ప్రకటించింది. పోలింగ్ సమయంలో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదుల నేపథ్యంలో డైమండ్ హార్బర్, మగ్రాహట్ వెస్ట్ నియోజకవర్గాల్లోని 15 బూత్‌లలో తిరిగి పోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఈసీ తెలిపింది. మగ్రాహట్ పశ్చిమ్‌లోని 11, డైమండ్ హార్బర్‌లోని 4 కేంద్రాలలో శనివారం రీ-పోలింగ్ జరుగుతుందని ఈసీ ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. అయితే, వీటితోపాటు 30 కేంద్రాల్లోనూ రీ-పోలింగ్ జరిపించాలని బీజేపీ కోరుతోంది. దీనిని కూడా ఈసీ పరిశీలిస్తోంది. ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ రోజున ఫల్తాలో ఈవీఎంలపై బీజేపీ గుర్తు కనిపించకుండా టేపులు అంటించినట్టు వీడియోలు వైరల్ అయిన విషయం తెలిసిందే. "పశ్చిమ బెంగాల్ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 29న నిర్వహించిన పోలింగ్‌కు సంబంధించి మగ్రాహత్ వెస్ట్, డైమండ్ హార్బర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, పరిశీలకుల నుంచి అందిన నివేదికలు, మరికొన్ని కీలక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 58 సబ్ -సెక్షన్ (2) ప్రకారం పైన పేర్కొన్న రెండు స్థానాల్లో కింది పోలింగ్ స్టేషన్లలో ఏప్రిల్ 29న నిర్వహించిన పోలింగ్ చెల్లదు.. సదరు పోలింగ్ స్టేషన్లలో మే 2న రీ-పోలింగ్ నిర్వహిస్తున్నాం" అని బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి తన ఉత్తర్వులో పేర్కొన్నారు. మొత్తం 15 బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 'పోలింగ్ జరిగే ప్రాంతంలో చాటింపు ద్వారా వీలైనంత విస్తృత ప్రచారం కల్పించాలి.. అలాగే రీ-పోలింగ్ జరుగుతుందని పోటీ చేస్తున్న అభ్యర్థులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలి" అని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మొత్తం 294 స్థానాలకు రెండు దశల్లో పోలింగ్ నిర్వహించారు. పశ్చిమ్ బెంగాల్‌లో రికార్డుస్థాయిలో 92 శాతానికిపైగా పోలింగ్ నమోదయినట్టు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. తొలి దశలో 152 సీట్లకు ఏప్రిల్ 23న జరిగిన పోలింగ్‌లో 93.19 శాతం ఓటింగ్ నమోదయ్యింది. రెండో దశలోనూ 92 శాతం దాటింది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల అనంతర హింసాత్మక ఘటనలను నివారించేందుకు ఎన్నికల సంఘం అత్యంత అప్రమత్తంగా ఉంది. తమ పార్టీ తరఫు ప్రతినిధులు లేకుండానే బ్యాలెట్ బాక్సులను తెరిచారని ఆరోపిస్తూ తృణమూల్ కాంగ్రెస్ నాయకులు నిరసనలకు దిగడంతో ఓట్ల లెక్కింపు జరిగే ఏడు ప్రాంతాల్లో ఆందోళనలు, నిరసనలను పోలీసులు నిషేధించారు. అటు, తృణమూల్ ఆరోపణలను పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్ తోసిపుచ్చారు.

వయ్యారి చిత్రం







## జూన్ 4న పెద్ది రిలీజ్

వేసవి సెలవులు అంటేనే థియేటర్ల దగ్గర ఒక రకమైన సందడి ఉంటుంది. ముఖ్యంగా పెద్ద హీరోల సినిమాలు ఈ టైమ్‌లో వస్తే ఆ కిక్కే వేరు. అయితే పెద్ద సినిమలేవి కూడా సమ్మర్ ను క్యాష్ చేసుకోలేదు. ముఖ్యంగా రామ్ చరణ్ పెద్ది సినిమా ఎప్పుడో రావాలి. కానీ సినిమా పనులు ఆలస్యం వలన వాయిదా పడుతూ వచ్చింది ఇక ఫైనల్ గా జూన్ నెలాఖరున వస్తుందని అందరూ ఫిక్స్ అయిపోయిన తరుణంలో, సడన్‌గా లెక్కలన్నీ తారుమారయ్యాయి. సాధారణంగా పెద్ద సినిమాల రిలీజ్ డేట్ మారడం అంటే ఏదో షూటింగ్ ఆలస్యమై వెనక్కి జరుగుతుందని అనుకుంటాం. కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయింది. నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోతున్న దర్శకుడు బుచ్చిబాబు, అందరినీ సర్ప్రైజ్ చేస్తూ ఒక అడుగు ముందుకు వేశారు. నిన్నటితో శృతి హాసన్ స్పెషల్ సాంగ్ షూటింగ్ కూడా ప్యాకప్ చెప్పేయడంతో, సినిమాను ఇక ఎంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే దానిపై మేకర్స్ ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తోంది. అసలు విషయం ఏంటంటే, ఎవరూ ఊహించని విధంగా 'పెద్ది' రిలీజ్ డేట్‌ను మూడు వారాలు ముందుకు జరిపి జూన్ 4న ఫిక్స్ చేశారు. ఇన్నాళ్లూ జూన్ 25 అని ప్రచారం జరగడంతో చాలామంది హాలిడేస్ అడ్వాంటేజ్ మిస్ అవుతుందేమో అని భయపడ్డారు. కానీ ఇప్పుడు జూన్ మొదటి వారానికే చరణ్ బాక్సాఫీస్ బరిలోకి దిగుతుండటంతో, విద్యార్థులకు సెలవులు ముగిసేలోపు ఆ ఆఖరి పది రోజులను పూర్తిగా క్యాష్ చేసుకోవచ్చనే స్ట్రాటజీని టీమ్ సిద్ధం చేసినట్లు అనిపిస్తుంది. ఈ డేట్ సెలెక్షన్ వెనుక ఉన్న ప్లాన్ చూస్తుంటే, ఒక పక్కా సోలో విండో కోసం టీమ్ పట్టుబట్టినట్లు తెలుస్తోంది. జూన్ నెలాఖరున ఇతర ప్రాజెక్టుల సందడి ఉండటంతో, ఎవరికీ చిక్కకుండా జూన్ మొదట్లోనే వచ్చి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని చరణ్ భావిస్తున్నట్లు అర్థమవుతుంది. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ ఇప్పటికే చార్ట్ బస్టర్ గా నిలవగా, ఇక రిలీజ్ వరకు మరికొన్ని సాంగ్స్ తో మరింత బజ్ క్రియేట్ చేయాలని చూస్తున్నారు.



## బాలయ్య-కొరటాల కాంబోలో మువీ

టాలీవుడ్ లో కొన్ని కాంబినేషన్లు అనౌన్స్ అయిన వెంటనే ఇండస్ట్రీ వర్గాల్లో ఒక రకమైన ఊపు వస్తుంది. నందమూరి బాలకృష్ణ కొరటాల శివ కలయిక కూడా అలాంటిదే. 'అఖండ', 'వీరసింహారెడ్డి' వంటి సినిమాలతో బాలయ్య మాస్ స్టామినా ఏంటో మరోసారి ప్రూవ్ చేసుకున్నప్పటికీ ఆ తరువాత అఖండ 2 అంతగా క్లిక్ కాలేదు. కానీ ఆయన ఒక స్టార్ డైరెక్టర్ తో పక్కా కమర్షియల్ ఫార్ములాలో సినిమా తీస్తే వచ్చే కిక్కే వేరు. సామాజిక సందేశాన్ని కమర్షియల్ అంశాలతో మిక్స్ చేసే కొరటాల శివకు ఉన్న ట్రాక్ రికార్డ్ చూస్తే, ఈ క్రేజీ కాంబోపై అభిమానుల్లో భారీ అంచనాలు పెరగడం కామన్. ఇక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బాలకృష్ణ కొరటాల శివ ఎన్‌బీకే 112 ప్రాజెక్ట్ అధికారికంగా అనౌన్స్ అయింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. బ్లాక్ అండ్ వైట్ లుక్ లో బాలయ్య, కొరటాల ఫోటోలు కాంట్రాస్ట్ గా కనిపిస్తుండగా, దానిపై ఉన్న లైన్స్ సినిమా రేంజ్ ను చెబుతున్నాయి. సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.




## డ్యాన్స్ రాదని తిట్టిపోశారు: ప్రియాంక చోప్రా

కెరీర్ తొలినాళ్లలో బాలీవుడ్‌లో తనకు ఎవరూ సహాయం చేయలేదని, ఎవరితోనూ బంధుత్వం లేదని అంటోంది కథానాయిక ప్రియాంక చోప్రా. అందాల పోటీలో విజేతగా మొదలు పెట్టి.. బాలీవుడ్, హాలీవుడ్‌లోనూ సత్తాచాటి అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ సంపాదించుకున్న నాయిక ఈమె. పలు వైవిధ్యమైన కథలతో ఓటీటీ వేదికగా కూడా అదరగొడుతున్న ఈ తార.. ప్రస్తుతం 'వారణాసి'తో బిజీగా గడుపుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక.. తన సినీ కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. 'నాకు ఒక సవాలు ఎదురైతే.. దానిని ఎదుర్కొని నిలబడి విజయం సాధించాలని గట్టిగా నిర్ణయించుకునే రకం నేను. నాకు ఎప్పుడూ పోటీతత్వం ఇష్టం. నాతో నేను కూడా పోటీ పడతా. అందాల పోటీ ప్రపంచంలో గానీ, సినిమా రంగంలో గానీ నాకు ఎవరితోనూ బంధుత్వం లేదు. అందుకే చాలా వేగంగా పనిని నేర్చుకోవాల్సి వచ్చింది. షూటింగ్ లేనప్పుడూ ఖాళీగా కూర్చునే దాన్ని కాదు. అనుభవం ఉన్న సహనటుల నుంచి ఏదైనా కొత్తగా నేర్చుకుంటూ.. వారి సృజనాత్మక ఆలోచనలన్నింటినీ గ్రహించేదాన్ని. కెరీర్ ఆరంభంలో డ్యాన్స్ విషయంలో చాలా ఇబ్బందులు పడ్డా. ఓవైపు నటన, మరోవైపు కొరియోగ్రాఫర్ చెప్పిన మూమెంట్స్.. ఇవన్నీ ఒకేసారి చేయడం నావల్ల అయ్యేది కాదు. వీటితో పాటు నా పక్కన కోస్టార్‌కు సరిపోయేలా స్టెప్స్ వేయడం అసాధ్యంలా అనిపించేది. ఓసారి దక్షిణాఫ్రికాలో ఓ పాట షూటింగ్ జరుగుతున్నప్పుడు కొరియోగ్రాఫర్ రాజు ఖాన్ నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "నువ్వు ఏదో అందాల పోటీల నుంచి వచ్చుండొచ్చు. కానీ నటి కావాలంటే ముందు డ్యాన్స్ నేర్చుకో" అంటూ మైక్ కింద పడేసి సెట్ నుంచి వెళ్లిపోయారు. ఆ సమయంలో నాకెంతో అవమానంగా అనిపించింది. దీన్ని సవాలుగా తీసుకొని నాలో ఉన్న ఈ డ్యాన్స్ అనే బలహీనతను అధిగమించాను. రోజుకు ఆరు గంటలు కత్రినా కైఫ్‌తో కలిసి ప్రాక్టీస్ చేశా' అని పేర్కొంది.

## అషురెడ్డి విషయంలో జాగ్రత్త: హైకోర్టు

నటిగా సుపరిచితులు అషురెడ్డికి సంబంధించి హైదరాబాద్ సీసీఎస్ లో ఒక ఫిర్యాదు రావటం.. దానిని పోలీసులు కేసు కట్టటం తెలిసిందే. హైదరాబాద్ కు చెందిన ఎన్నారై ధర్మేంద్రను పెళ్లి చేసుకుంటానని చెప్పి.. మోసం చేసినట్లుగా ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించి ఆమె తాజాగా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు మీడియాకు.. కంటెంట్ క్రియేటర్లు.. యూట్యూబర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అషురెడ్డి గురించి అవమానకరంగా.. అవాస్తవ కథనాలు ప్రసారం చేయొద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాదు ఆమె పరువు నష్టం కలిగించే అంశాల్ని ప్రచురించొద్దని కోర్టు స్పష్టం చేసింది. మీడియా సంస్థలు.. కంటెంట్ క్రియేటర్లు.. సోషల్ మీడియాలో ఆమెకు వ్యతిరేకంగా.. ఆమెను అవమానించేలా వ్యాఖ్యలు.. పోస్టులు పెట్టొద్దని స్పష్టం చేసింది. అంతేకాదు.. ఇప్పటికే అప్ లోడ్ చేసిన వివాదాస్పద కంటెంట్ ను తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ.. తమ ఆదేశాల్ని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాల గురించి తాజాగా నటి అషురెడ్డి సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. కోర్టు ఆదేశాల్ని గౌరవించాలని తాను కోరుతున్నట్లు పేర్కొన్నారు. తన ప్రైవసీకి భంగం వాటిల్లేలా మీడియా వ్యవహరించొద్దని.. ప్రస్తుతం తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉందన్న విషయాన్ని ప్రస్తావించారు. తనపై పెట్టిన అభ్యంతరకర పోస్టులను తొలగించాలని కోరారు.





## వివాహ బంధానికి ఎవలీన్ శర్మ గుడ్‌బై

ప్రముఖ నటి ఎవలీన్ శర్మ తన భర్తతో విడిపోతున్నట్లు ప్రకటించింది. తమ ఐదేళ్ల వివాహ బంధానికి గుడ్ బై చెప్పనుంది. ఈ విషయాన్ని తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఈ విషయంపై ఓ ఛానెల్‌లో మాట్లాడిన ఆమె.. అవును మేమిద్దరం పరస్పరం అంగీకారంతోనే విడిపోవాలని నిర్ణయించుకున్నామని తెలిపింది. పిల్లల విషయంలో ఇద్దరం బాధ్యత తీసుకుంటామని పేర్కొంది. ఇలాంటి మేము గోప్యతను కోరుకుంటున్నామని అన్నారు. కాగా.. నటి ఎవలిన్ శర్మ 2021 మే 15న డెంటల్ సర్జన్ అయిన తుషాన్ బిందీని పెళ్లాడారు. వీరికి కుమార్తె ఆవా, కుమారుడు ఆర్డెన్ అనే ఇద్దరు పిల్లలు జన్మించారు. పెళ్లైన ఐదేళ్లకే ఈ జంట విడాకులు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. స్నేహపూర్వకంగా తమ బంధానికి ముగింపు పలుకుతున్నామని ఎవలీన్ తెలిపారు. తమ పిల్లలను మాత్రం కలిసే పెంచుతామని కూడా స్పష్టం చేశారు. కాగా.. ఎవలీన్ శర్మ 2012లో హిందీ సినీ ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చారు. 2019 వరకు పలు హిందీ చిత్రాలలో కనిపించారు. ఆమె 2013లో విడుదలైన 'యే జవానీ హై దీవానీ' మూవీలో మెప్పించింది. అంతేకాకుండా 2014లో విడుదలైన 'యారియాన్', 'మై తేరా హీరో' చిత్రాల్లో కూడా నటించింది. తెలుగులో ప్రభాస్ మూవీ సాహోలో ఐషా పాత్రలో ఆకట్టుకుంది.





# ఢిల్లీ ధమాకా

## రాజస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో విన్.. హ్యాట్రిక్ ఓటములకు బ్రేక్

ఐపీఎల్ 2026లో హ్యాట్రిక్ ఓటములకు ఢిల్లీ క్యాపిటల్స్ బ్రేక్ వేసింది. శుక్రవారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచులో ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్.. 225/6 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

**దీంతో పాయింట్స్ టేబుల్‌లో ఏడో ప్లేసు నుంచి ఆరో స్థానానికి చేరింది. మరోవైపు ఈ మ్యాచులో ఓడినా.. రాజస్థాన్ రాయల్స్ పాయింట్స్ టేబుల్‌లో నాలుగో స్థానాన్ని నిలుపుకుంది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ ఓ దశలో 12 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.**

ఈ సమయంలో కెప్టెన్ రియాన్ పరాగ్.. నేనున్నానంటూ ముందుకొచ్చాడు. ఈ సీజన్‌లో తొలిసారి అతడి బ్యాట్ నుంచి పరుగులు వచ్చాయి. మొత్తంగా ఈ ఇన్నింగ్స్‌లో అతడు 50 బంతుల్లో 90 రన్స్ చేశాడు. చివర్లో డోనోవాన్ ఫెర్రీరా 14 బంతుల్లో 47 రన్స్ చేసి అజేయంగా నిలిచి జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. ఫెర్రీరా ఈ ఇన్నింగ్స్‌లో 6 సిక్సులు, 2 ఫోర్లు కొట్టాడు. అనంతరం 226 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు కేఎల్ రాహుల్ (40 బంతుల్లో 75 రన్స్), పథుమ్ నిస్సాంక (33 బంతుల్లో 62 రన్స్) శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 57 బంతుల్లో 110 రన్స్ జోడించి.. గట్టి పునాది వేశారు. చివర్లో వీరిద్దరూ ఔట్ అయినా.. నితీశ్ రాణా (17 బంతుల్లో 33 రన్స్), అశుతోష్ శర్మ (15 బంతుల్లో 25 రన్స్) మ్యాచ్ ముగించారు. దీంతో 19.1 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్ మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఊపిరి పీల్చుకుంది. ఎందుకంటే ఆ జట్టు వరుసగా మూడు ఓటముల తర్వాత ఈ విజయం సాధించింది. దీంతో ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆడిన 9 మ్యాచులలో 4 విజయాలు, ఐదు ఓటములతో ఆరో ప్లేసులో ఉంది. మరోవైపు ఈ టోర్నీలో నాలుగో ఓటమి నమోదు చేసిన రాజస్థాన్ రాయల్స్.. 10 లీగ్ మ్యాచులు ముగిశాక నాలుగో ప్లేసులో ఉంది. లీగ్ స్టేజ్ ముగిసే సరికి పాయింట్స్ టేబుల్‌లో తొలి నాలుగు స్థానాల్లో ఉన్న జట్లు ప్లే ఆఫ్స్ చేరతాయి.



### ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 8 | 6 | 1 | 13 |
| బెంగళూరు | 8 | 6 | 3 | 12 |
| హైదరాబాద్ | 9 | 6 | 3 | 12 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 9 | 5 | 4 | 10 |
| ఢిల్లీ | 9 | 4 | 5 | 8 |
| చెన్నై | 8 | 3 | 5 | 6 |
| కోల్‌కతా | 8 | 2 | 5 | 5 |
| ముంబై | 8 | 2 | 6 | 4 |
| లక్నో | 8 | 2 | 6 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు



## సన్‌రైజర్స్ జట్టులోకి అంబరీష్

ఐపీఎల్ 2026లో మిగిలిన మ్యాచుల కోసం సన్ రైజర్స్ హైదరాబాద్.. తమ జట్టులో మార్పులు చేసింది. గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే.. సీజన్ మొత్తానికి దూరమైన శివమ్ మావికి రీప్లేస్‌మెంట్ ప్రకటించింది. అండర్-19 2026 ప్రపంచకప్‌లో భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన 18 ఏళ్ల సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబరీష్ తీసుకుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. కుడిచేతి మీడియం పేసర్, ఎడమచేతి బ్యాటర్ అయిన అంబరీష్ 2026 అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఈ టోర్నీలో అతడు టీమిండియా తరఫున 11 వికెట్లు తీశాడు. టీమిండియా లీడింగ్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. అంబరీష్ తమిళనాడులో జన్మించాడు. గతేడాది అక్టోబర్‌లో తమిళనాడు తరఫున.. జార్ఖండ్‌తో మ్యాచ్ ద్వారా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. ఇప్పటివరకు రెండు మ్యాచులు ఆడి, రెండు వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లోనూ 43 పరుగులు చేసి, ఆల్ రౌండ్ ప్రదర్శన కనబరిచాడు. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో అతడు రూ.30 లక్షల కనీస ధరతో చేరనున్నాడు. అంబరీష్ లాంటి యంగ్ ప్లేయర్‌కు నిజంగా ఇది సువర్ణావకాశం లాంటిదే. ఒకవేళ ప్లేయింగ్ లెవెన్‌లో చోటు దక్కి, సత్తాచాటితే మాత్రం అతడికి తిరుగు ఉండదు. ఈసారి సన్ రైజర్స్ హైదరాబాద్.. సీనియర్లకంటే కూడా కుర్రాళ్లపైనే విశ్వాసం ఉంచుతోంది. హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్ లాంటి సీనియర్ ప్లేయర్లు బెంచ్‌కే పరిమితం అవుతున్నారు. ఇదే సమయంలో ప్రఫుల్ హింగ్, సాకిబ్ హుస్సేన్ లాంటి యంగ్ బౌలర్లు అవకాశాన్ని అందిపుచ్చుకుని అదరగొడుతున్నారు. ప్యాట్ కమిన్స్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ లాంటి అంతర్జాతీ ప్లేయర్లతో అంబరీష్ డ్రెస్సింగ్ రూమ్ పంచుకోనున్నాడు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు శాంట్నర్ దూరం

ఐపీఎల్ నుంచి నిష్క్రమించిన మిచెల్ శాంట్నర్ తాజా పరిస్థితిపై న్యూజిలాండ్ క్రికెట్ కీలక విషయం వెల్లడించింది. ఫీల్డింగ్ చేస్తూ గాయపడి టోర్నీని వీడిన శాంట్నర్ కోలుకునేందుకు నెలకు పైగా పట్టనుందని కివీస్ బోర్డు తెలిపింది. ఎడమ భుజానికి గ్రేడ్ త్రీ ఆంటెరోలాటెరల్ ఫ్రాక్చర్స్ గాయం అయినందును శాంట్నర్ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమయ్యాడని వెల్లడించింది. పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్‌లో గాయపడిన మిచెల్ శాంట్నర్ స్వదేశం చేరుకున్నాడు. అక్కడ స్పెషలిస్ట్ డాక్టర్‌ను కలిసి స్కానింగ్ పరీక్షలు చేయించుకున్నాడు. ఈ టెస్టుల్లో అతడి భుజం గాయం తీవ్రత బయటపడింది. గ్రేడ్ త్రీ ఏసీఎల్ గాయం అయినందున భుజం కండరాల్లోని లిగమెంట్ పూర్తిగా దెబ్బతిన్నదని తేలింది. దాంతో, అతడు కోలుకునేందుకు నెల రోజులు పడుతుందని న్యూజిలాండ్ క్రికెట్‌కు వైద్యులు చెప్పారు. ఫలితంగా ఐర్లాండ్‌తో జరుగబోయే ఏకైక టెస్టు, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఈ స్పిన్నర్ అందుబాటులో ఉండడని న్యూజిలాండ్ బోర్డు పేర్కొంది. ఐర్లాండ్‌తో మే 27న.. ఆపై ఇంగ్లండ్ గడ్డపై జూన్ 4న టెస్టు సిరీస్‌లో కివీస్ తలపడనుంది. పంతొమ్మిదో సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన శాంట్నర్ ఏప్రిల్ 23న మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ గాల్లోకి లేపిన బంతిని క్యాచ్ అందుకునే క్రమంలో అతడి ఎడమ భుజం, తల నేలకు గట్టిగా తగిలాయి. భుజం నొప్పితో మైదానం వీడిన శాంట్నర్‌కు స్కానింగ్ పరీక్షలు జరపగా.. కండరాల్లో చీలిక వచ్చినట్టు వైద్యులు గుర్తించారు. దాంతో, కంకషన్‌కు గురైన అతడి స్థానంలో శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్‌కు రావడం పెద్ద దూమారమే రేపింది. ముంబై జట్టు కంకషన్ నిబంధనను ఉల్లంఘించిందని విమర్శలు వచ్చాయి. కానీ, కోచ్ మహేల జయవర్ధనే మాత్రం తాము అంపైర్, రిఫరీ అనుమతితోనే శార్దూల్‌ను ఆడించామని వివాదానికి ముగింపు పలికాడు.

## లక్ష్య సేన్, ఆయుశ్ అదరహో

ప్రతిష్ఠాత్మక థామస్ కప్‌లో భారత షట్లర్లు అదరగొట్టారు. లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి రాణించడంతో టీమిండియా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఈ ఇద్దరూ, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం చెలరేగడంతో చైనీస్ తైపీపై 3-0 విజయంతో భారత్ పతకానికి చేరువైంది. డెన్మార్క్ వేదికగా జరుగుతున్న థామస్ కప్ కీలక మ్యాచ్‌లో భారత షట్లర్లు తడాఖా చూపించారు. క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి, సాత్విక్ - చిరాగ్ జోడీ టాప్ గేర్‌లో ఆడడంతో చైనీస్ తైపీపై 3-0తో విజయం సాధించింది టీమిండియా. తొలుత సేన్ సింగిల్స్‌లో అతికష్టమ్మీద నెగ్గాడు. చౌ థియెన్ చెన్ ధాటికి తొలిసెట్ కోల్పోయినా పట్టువదలని భారత ఆటగాడు రెండో సెట్‌ను 22-10తో గెలుచుకున్నాడు. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ సేన్ అటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. సెట్ ఆసాంతం జోరు చూపించి 21-17తో గెలుపొంది ఆధిక్యాన్ని 1-0కు పెంచాడు. డబుల్స్‌లో సాత్విక్ చిరాగ్ ద్వయం చియు షియాంగ్ - వాంగ్ చి లిన్ జంటను చిత్తు చేసింది.



## ఏంటో హార్దిక్ కెప్టెన్సీ

ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 2026లో ఎదురీదుతోంది. ఆడిన 8 మ్యాచులలో ఆరింట్లో ఓడిపోయి.. సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరాలంటే మిగిలిన ఆరు మ్యాచులలోనూ గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జట్టు నిండా స్టార్లు ఉన్నప్పటికీ.. సమష్టిగా రాణించలేకపోవడం ఆ జట్టుకు ఇబ్బంది కరంగా మారింది. నిజానికి సీజన్ ప్రారంభానికి ముందు టైటిల్ ఫేవరెట్ జట్లలో ఒకటిగా ముంబై కనిపించింది. చాలా మంది విశ్లేషకులు సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఇటీవల రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. ముంబై నుంచి ఇలాంటి ప్రదర్శన అస్సలు ఊహించలేదని పేర్కొన్నాడు. తాజాగా వీరేంద్ర సెహ్వాగ్ , మురళీ కార్తిక్ సైతం.. ముంబై ప్రదర్శనపై స్పందించారు. ముఖ్యంగా కెప్టెన్ హార్దిక్ పాండ్యా తీసుకుంటున్న నిర్ణయాలపట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గత మ్యాచులో శార్దుల్ ఠాకూర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా జట్టులోకి తీసుకున్నప్పటికీ బౌలింగ్ ఇవ్వకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. "నాకు ఇప్పటికీ ఒక విషయం అర్థం కావడం లేదు. అదేంటంటే.. సన్ రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ సందర్భంగా రెండో ఇన్నింగ్స్‌లో ముంబై బౌలింగ్ చేస్తున్నప్పుడు శార్దుల్ ఠాకూర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా జట్టులోకి తీసుకున్నారు. కానీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా అతడిని తీసుకున్నాం అనే విషయాన్ని ముంబై ఇండియన్స్ మర్చిపోయిందా.. అని నాకు అనిపించింది. ఏం జరిగిందో నాకైతే ఇప్పటికీ అర్థం కావట్లేదు" అని మురళీ అన్నాడు. వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ.. 'మీరు (ముంబై ఇండియన్స్) ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటర్‌ను తీసుకున్నా, బౌలర్‌ను తీసుకున్నా.. అతడిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. ఈ మ్యాచులో శార్దూల్ ఠాకూర్‌కు కనీసం ఒక్క ఓవర్ అయినా ఇవ్వాల్సింది. ఎందుకంటే అతడో వికెట్ టేకింగ్ బౌలర్. కనీసం అతడిని ప్రయత్నిద్దామని కూడా మీకు అనిపించలేదా. ఆ నిర్ణయం పట్ల నేను షాక్ అయ్యా. ఏది ఏమైనా ఈ ప్రశ్నకు ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యానే సమాధానం చెప్పాలి' అని వీరూ వ్యాఖ్యానించాడు.



## టెస్ట్ ర్యాంకింగ్స్.. భారత్ నం.3

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అదరగొట్టిన టీమ్ఇండియా.. గతేడాది నుంచి టెస్టుల్లో కాస్త ఇబ్బంది పడింది. స్వదేశంలోనూ ఓటములను చవిచూసింది. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్ నాలుగో సీజన్ నడుస్తోంది. ఇప్పటికైతే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ - కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత జట్టు ఆరో స్థానంలో ఉంది. ఈ ఏడాది ఆస్ట్రేలియా, శ్రీలంక, న్యూజిలాండ్‌తో టెస్టులను మిగతా జట్లు వెనకబడితేనే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో వార్షిక టెస్టు ర్యాంకులను అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసింది. ఇందులో టీమ్ఇండియాకు మెరుగైన ఫలితాలు రావడం గమనార్హం. ఐసీసీ వార్షిక టెస్టు ర్యాంకుల్లో ఆస్ట్రేలియా (131 పాయింట్లు) అగ్రస్థానంలో నిలిచింది. రెండో స్థానం దక్షిణాఫ్రికా (119) సొంతమైంది. ఇక భారత్ (104) కూడా ఒక ప్లేస్‌ను మెరుగుపర్చుకుని మూడో స్థానానికి వచ్చింది. బజ్‌బాల్ క్రికెట్ అంటూ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తోన్న ఇంగ్లాండ్ (102) నాలుగో స్థానానికి పడింది. న్యూజిలాండ్ (101) ఐదో స్థానంలో ఉండగా, ఆ తర్వాత పాకిస్థాన్ (89), శ్రీలంక (86), వెస్టిండీస్ (68), బంగ్లాదేశ్ (67), ఐర్లాండ్ (25), జింబాబ్వే (10) కొనసాగుతున్నాయి. మొత్తం 12 జట్లలో అఫ్గానిస్థాన్‌కు మాత్రమే ఒక్క పాయింట్ కూడా రాకపోవడం గమనార్హం.

## హాకీ బంతి తగిలి బాలిక మృతి

పాఠశాలలో హాకీ శిక్షణ తీసుకుంటుండగా బంతి తలకు బలంగా తగిలి 13 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయింది. గోవాలోని గుయిరింలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రుయిూషా ఖర్సెల్ ఈ ఘటనలో మరణించింది. వేసవి సెలవులకు ముందు పాఠశాల చివరిరోజు కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా హాకీ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో జరగబోయే పోటీల కోసం సిద్ధమవుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. రుయిూషా తలకు బంతి బలంగా తగలడంతో ఆమె మైదానంలోనే కుప్పకూలిపోయింది. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసినప్పటికీ అది రావడానికి సమయం పడుతుందని తెలుసుకుని పాఠశాల సిబ్బంది ఓ ప్రైవేట్ వాహనంలో రుయిషాను ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# 'మత్తు'లో భారత యువత

భారతదేశం నేడు ఒక విభిన్నమైన, తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అదే డ్రగ్స్ భూతం. దేశానికి వెన్నెముక వంటి యువశక్తి నేడు మత్తు పదార్థాల కోరల్లో చిక్కి విలవిలలాడుతోంది. సరదాగా మొదలై, వ్యసనంగా మారి, చివరకు జీవితాలనే బుగ్గిపాలు చేస్తున్న ఈ మహమ్మారిని అరికట్టడం ఇప్పుడు అత్యవసరం. గడిచిన ఎనిమిదేళ్లలో దేశంలో మాదకద్రవ్యాల వినియోగం దాదాపు 70 శాతం పెరగడం విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ధనవంతులకు మాత్రమే పరిమితమైన కొకైన్, హెరాయిన్ వంటి మందులు నేడు సామాన్య యువతకు కూడా సులభంగా అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా, గంజాయి, సింథటిక్ డ్రగ్స్ వినియోగం విపరీతంగా పెరిగింది. గణాంకాల ప్రకారం, డ్రగ్స్‌కు బానిసలైన వారిలో దాదాపు సగం మంది 35 ఏళ్లలోపు వారే ఉండటం ఆందోళన కలిగించే విషయం. యువత ఈ దారిలోకి వెళ్లడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి విద్యా, ఉద్యోగ పోటీలు, నిరుద్యోగం, మరియు కుటుంబ సమస్యల నుంచి తప్పించుకోవడానికి యువత మత్తును ఆశ్రయిస్తున్నారు. కేవలం ఒకసారి "సరదాగా" ప్రయత్నిద్దామని మొదలుపెట్టి వ్యసనపరులుగా మారుతున్నారు. డార్క్ నెట్, సోషల్ మీడియా వేదికల ద్వారా డ్రగ్స్ సరఫరా దొంగచాటుగా కొనసాగుతోంది. డ్రగ్స్ ఒక వ్యక్తిని మాత్రమే కాదు, మొత్తం సమాజాన్ని నాశనం చేస్తాయి. డ్రగ్స్ వాడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, నేరాలు పెరగడానికి కూడా ఇది ప్రధాన కారణమవుతోంది. నేడు జరుగుతున్న అనేక హత్యలు, దోపిడీలు, అత్యాచారాల వెనుక మత్తు పదార్థాల ప్రేరణ ఉన్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. ఒకసారి డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటే ప్రభుత్వ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ జారీ వంటి అవకాశాలు మూసుకుపోయి భవిష్యత్తు అంధకారమవుతుంది. కేంద్ర ప్రభుత్వం 2029 నాటికి 'డ్రగ్ ఫ్రీ ఇండియా' లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ, ఇది ప్రభుత్వాల వల్ల మాత్రమే సాధ్యం కాదు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలోని మార్పులను గమనిస్తూ, వారికి స్నేహితుల్లా మద్దతుగా నిలవాలి. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కల్పించాలి. డ్రగ్స్ మాఫియా నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసేందుకు పోలీసులు, దర్యాప్తు సంస్థలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. యువత ఉజ్వల భవిష్యత్తును కాపాడటం అంటే దేశ భవిష్యత్తును కాపాడటమే. డ్రగ్స్ అనే విషసంకెళ్ల నుండి యువశక్తిని విముక్తి చేయడానికి సమాజం, కుటుంబం, ప్రభుత్వం కలిసి పోరాడాలి. యువత మత్తును వీడి, మనిషిగా ఎదిగి, నవ భారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి.



# అమ్మో..
## ఒకటో తేదీ!


**ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే సామాన్యుడు ఆందోళనగా చూసేది చమురు సంస్థల ప్రకటనల వైపే. గృహ అవసరాల గ్యాస్ ధరలు కొంత కాలంగా స్థిరంగా ఉన్నప్పటికీ, కమర్షియల్ గ్యాస్ (19 కేజీల సిలిండర్) ధరలు తరచూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.**

ఇది వ్యాపారవేత్తల సమస్య మాత్రమే కాదు, అంతిమంగా వినియోగదారుడిపై పడే భారమే. హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, చిరుతిండి బండ్లు నడవడానికి గ్యాస్ అత్యంత ప్రాథమిక ఇంధనం. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర పెరిగిన ప్రతిసారీ హోటల్ యజమానుల నిర్వహణ వ్యయం భారీగా పెరుగుతుంది. గ్యాస్ ధర పెరిగిన వెంటనే హోటల్ మెనూ ధరలను పెంచడం సాధ్యం కాదు. దీనివల్ల యజమానులు తమ లాభాలను తగ్గించుకోవాల్సి వస్తోంది. పెరుగుదల భారీగా ఉన్నప్పుడు, యజమానులు చేసేది లేక టిఫిన్లు, భోజనాల ధరలను రూ.5 నుంచి రూ. 20 వరకు పెంచక తప్పడం లేదు. సామాన్యుడు నేరుగా కమర్షియల్ గ్యాస్ కొనకపోయినా, హోటల్ ధరల పెరుగుదల వల్ల అతడి నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోంది. ఉద్యోగ రీత్యా బయట తినే బ్యాచిలర్లు, ప్రయాణికులు, వారాంతాల్లో కుటుంబంతో కలిసి రెస్టారెంట్‌కు వెళ్లే మధ్యతరగతి ప్రజలకు ఈ ధరల పెరుగుదల భారంగా మారుతోంది. గ్యాస్ ధర పెరిగితే ఆ రవాణా ఖర్చులు, తయారీ ఖర్చులు పెరిగి చివరకు వీధి పక్కన అమ్మే టీ, కాఫీ ధరలు కూడా పెరుగుతున్నాయి. పెద్ద పెద్ద రెస్టారెంట్లు ధరల పెరుగుదలను తట్టుకోగలిగినా, చిన్న చిన్న టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్ల వ్యాపారుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. పెరిగిన గ్యాస్ ధరలకు అనుగుణంగా రేట్లు పెంచితే కస్టమర్లు రారనే భయం, పెంచకపోతే పెట్టుబడి కూడా రాదనే ఆందోళన వారిని వెంటాడుతోంది. హోటల్ రంగం దేశంలో లక్షల మందికి ఉపాధినిస్తోంది. గ్యాస్ ధరల పెరుగుదల వల్ల ఈ రంగం కుదేలైతే, అది పరోక్షంగా ఉపాధి కోతకు కూడా దారితీయవచ్చు. అలాగే, ఆహార ద్రవ్యోల్బణం పెరగడానికి ఇది ఒక ప్రధాన కారణమవుతోంది. ఇంధన ధరల పెరుగుదల అనేది కేవలం వ్యాపార అంశం మాత్రమే కాదు, అది సామాన్యుడి పళ్లెంలో ఆహార భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీసే అంశం. పన్నుల తగ్గింపు లేదా రాయితీల ద్వారా హోటల్ పరిశ్రమను, తద్వారా సామాన్యుడిని ప్రభుత్వాలు ఆదుకోవాలి.

1st



- శ్రీకాంత్ చుక్క
నిజామాబాద్




# అక్షర దోపిడీ..
# అడ్డుకోలేని సర్కారు!

**నేటి రోజుల్లో సామాన్యుడికి విద్య అందని ద్రాక్షలా మారుతోంది. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని తపించే తల్లిదండ్రుల ఆశలను ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార వనరుగా మార్చుకుంటున్నాయి. ఏటా విచ్చలవిడిగా పెరుగుతున్న ఫీజులు ఒకెత్తయితే, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, స్టేషనరీ పేరుతో సాగిస్తున్న అదనపు దోపిడీ సామాన్యుడి నడ్డి విరుస్తోంది.**

**విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలలు నేడు పక్కా కార్పొరేట్ వ్యాపార కేంద్రాలుగా మారిపోవడం విచారకరం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. పాఠశాలలు విద్యను మాత్రమే అందించాలి తప్ప, వస్తువుల విక్రయశాలలుగా మారకూడదు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది.**



వినోద్ కుమార్
ఐటీ ఉద్యోగి

పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, చివరకు పెన్సిళ్లు కూడా పాఠశాల నిర్దేశించిన కౌంటర్లలోనే కొనాలన్న షరతు విధిస్తున్నారు. బయట మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే పుస్తకాలను, పాఠశాల యాజమాన్యాలు ముద్రిత ధర కంటే ఎక్కువకు లేదా భారీ లాభాలతో విక్రయిస్తూ తల్లిదండ్రుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. ప్రైవేట్ ప్రచురణకర్తలతో కుమ్మక్కై, కమీషన్ల కోసం ప్రతి ఏటా సిలబస్ మారుస్తూ పాత పుస్తకాలు పనికిరాకుండా చేస్తున్న వైనం గమనార్హం. ఈ దోపిడీ బహిరంగంగా జరుగుతున్నా విద్యాశాఖ 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటి? క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం చూపుతున్న మెతకవైఖరి విద్యాసంస్థల ఆగడాలకు ఊతమిస్తోంది. కేవలం నోటీసులకే పరిమితం కాకుండా, విచ్చలవిడి ఫీజులను అరికట్టేలా ఒక పటిష్టమైన ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. విద్య అనేది సామాజిక బాధ్యత, లాభార్జన వ్యాపారం కాకూడదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై స్పష్టమైన చట్టం తీసుకురావాలి. పుస్తకాలు, యూనిఫారాలను బయట మార్కెట్‌లో కొనుగోలు చేసే స్వేచ్ఛను తల్లిదండ్రులకు కల్పించాలి. నిబంధనలు అతిక్రమించే విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసేంత కఠినంగా వ్యవహరించాలి. లేనిపక్షంలో అక్షరాస్యత శాతం పెరిగినా, సామాన్యుడు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూనే, ప్రైవేట్ దోపిడీని అరికట్టాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

### తెలంగాణలో ఫీజుల నియంత్రణకు సంబంధించిన కీలక జీవోలు, పరిస్థితులు

జీవో 46 (2020): కోవిడ్ సమయంలో ఈ జీవో ద్వారా ప్రైవేట్ స్కూళ్లు ఫీజులు పెంచకూడదని, కేవలం నెలవారీ ట్యూషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ, చాలా స్కూళ్లు దీనిని ఉల్లంఘించాయని వార్తలు వచ్చాయి.

యూనిఫారాలు, పుస్తకాల విక్రయాలపై ఆంక్షలు: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ ఒక కీలక ఆదేశం జారీ చేసింది. దీని ప్రకారం, పాఠశాల ప్రాంగణంలో యూనిఫారాలు, షూస్, బెల్టులు వంటివి అమ్మకూడదు. పుస్తకాలు, స్టేషనరీ అమ్మకాలు లాభాపేక్ష లేకుండా మాత్రమే జరపాలి. కానీ, ఫీజుల నియంత్రణకు ఒక నిర్దిష్ట చట్టం లేదా కమిటీ లేకపోవడం వల్ల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల, ఫీజుల పెంపును 8 శాతానికి పరిమితం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించినా, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దీనిని వ్యతిరేకించినట్లు సమాచారం.

### ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇలా..

జీవో 53, 54 (2021): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ జీవోల ద్వారా ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల ఫీజులను నియంత్రించడానికి ప్రయత్నించింది. ఉదాహరణకు, గ్రామ పంచాయతీల్లోని ప్రైమరీ స్కూళ్లకు రూ. 10,000, మున్సిపాలిటీల్లో రూ. 11,000, కార్పొరేషన్లలో రూ. 12,000 గరిష్ట ఫీజుగా నిర్ణయించింది. అయితే, హైకోర్టు ఈ జీవోలను కొట్టివేసి, పాఠశాల యాజమాన్యాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్తగా ఫీజులు నిర్ణయించాలని సూచించింది.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.